నేడు
విలేకరులు కావలెను
నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు nedudailynews@gmail.comకు మీ బయోడెటాను పంపగలరు.
9848992874
9346984911

సంచలన వార్తలకు
నేడు
TELUGU DAILY

నేడు
విలేకరులు కావలెను
నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు nedudailynews@gmail.comకు మీ బయోడెటాను పంపగలరు.
9848992874
9346984911

మంగళవారం-29.10.2024 | హైదరాబాద్ సంపుటి -2 సంచిక-184 | పేజీలు -9 వెల: రూ.2
www.nedudailynews.com

వామ్మో.. మోమోస్..!

- మోమోస్ తిన్న 50 మంది అస్వస్థతకు గురి
- ఓ మహిళ మృతి
- బంజారాహిల్స్లోని నంది నగర్‌లో ఘటన

2

ధర ధమాల్

- ఖమ్మం, ఎనుమాములకు పోటెత్తిన పత్తి
- పత్తి బస్తాలతో తరలివచ్చిన రైతులు
- క్వింటాల్ పత్తి 6200 దాటడం లేదు
- ఒకేరోజు 200 ధర తగ్గడంతో ఆందోళన

2

రోడ్డుపై కుప్పలుగా

- 100, 500 నోట్లు
- ఎగబడి ఏరుకున్న జనం
- లాస్ట్‌లో పోకిరి లెవల్ ట్విస్ట్..!

2

జస్ట్ మిస్?

వ్యూహం అమలులో తొందరపాటు?

- జన్వాడ ఫాం హౌజ్ ఘటనలో టార్గెట్ కేటీఆర్?
- విజయ్ మద్దూరితో రాజ్ పాకాల పరిచయమే అస్త్రం?
- కొద్దిరోజులుగా విజయ్ మద్దూరిపై ఫోకస్ పెట్టిన నిఘా విభాగం?
- తెరవెనుక చక్రం తిప్పిన ఓ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్?
- ఫాంహౌజ్ పార్టీకి కేటీఆర్ పక్కాగా వస్తారనుకుని అత్యుత్సాహం?
- నిర్ధారించుకోకుండానే తనిఖీలకు ఎంట్రీ ఇచ్చిన పోలీసులు?
- ఒకవేళ కేటీఆర్ అక్కడే ఉంటే.. విజయ్ మద్దూరితో సహా కేటీఆర్‌పై కేసు నమోదుకు ప్లాన్?
- కేటీఆర్ మిస్ కావడంతో పోలీసులకు ప్రభుత్వ పెద్దల చివాట్లు?
- ప్రకంపనలు సృష్టించాల్సిన ఘటనే.. పసలేకుండా చేసిందని ఫైర్?
- జన్వాడ ఘటనతో పూర్తిస్థాయిలో అలర్టయిన కేటీఆర్, అతని బంధువులు
- ఇది జస్ట్ మిస్సా... మిస్ ఫైరా? అనేది హాట్ టాపిక్?

హైదరాబాద్, నేడున్యూస్: రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టించిన శంకర్‌పల్లి జన్వాడ ఫాంహౌజ్ దావత్ ఘటన వెనుక విస్తుపోయే అంశాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. పక్కా పథకం ప్రకారం వేసిన వ్యూహం కాస్త తొందరపాటు కారణంగా బెడిసికొట్టినట్లు తెలుస్తోంది. పెను సంచలనంగా, ఆసక్తికలిగించేలా ముందే స్క్రిప్ట్ రెడీ చేసినా.. క్షేత్రస్థాయిలో మాత్రం జరిగింది మరోటి కావడంతో స్కెచ్ వేసిన వారంతా ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. ఫాంహౌజ్ ఘటనతో రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పుదామని.. అందుకోసం కొన్ని రోజులుగా గ్రౌండ్ వర్క్ చేసినా చివరలో ఆశించింది అందకుండా పోయినట్లు విమర్శలు వస్తున్నాయి.

ఫాంహౌజ్ ఘటన ఎవరికి కష్టాలు తెచ్చిపెట్టేదనే విషయానికి సంబంధించి నేడు పత్రికకు అత్యంత షాకింగ్ కలిగించే అంశాలు చేరాయి. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు ఫాంహౌజ్ ఘటనకు ముందు తెరవెనుక ఏం జరిగిందనే విషయాలను పాఠకులకు అందించాలని నిర్ణయించాం. వేసిన వ్యూహం పక్కాగా అమలైతే, రాష్ట్ర రాజకీయాల్లో జన్వాడ ఫాంహౌజ్ ఘటన ఊహించని ఘటనగా మిగిలిపోయేది. డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చిన విజయ్ మద్దూరి ఆధారంగా బీఆర్ఎస్ కీలక నేత అరెస్ట్‌కు అంతా సిద్ధం చేసినా చివరకు వర్కౌట్ కాలేదు. దీంతో ప్రస్తుతం బీఆర్ఎస్ కీలక నేతకు గండం తప్పినట్లయ్యింది.

విజయ్ మద్దూరి పైనే ఫోకస్?

బీఆర్ఎస్ కీలక నేతను జైలుకు పంపాలనే వ్యూహంలో భాగంగా.. నేర చరిత్ర కలిగిన విజయ్ మద్దూరిపై పోలీసులు కొంతకాలంగా నిఘా పెట్టారు. ఐటీ కన్సల్టెంట్‌గా ఉన్న విజయ్ మద్దూరికి పలు ఐటీ కంపెనీలు కూడా ఉన్నాయి. విజయ్ మద్దూరికి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాలకు అత్యంత సన్నిహిత్యమైన స్నేహం కూడా ఉంది. విజయ్ మద్దూరి ద్వారానే కేటీఆర్‌ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలనే పథకంలో భాగంగా విజయ్ మద్దూరిపై నిఘా కొనసాగింది. విజయ్ మద్దూరి కొద్దిరోజులుగా ఎక్కడా ప్రైవేటు పార్టీలకు హాజరు కాలేదు. కానీ శనివారం సాయంత్రం విజయ్ మద్దూరి కదలికలపై నిఘా విభాగానికి సమాచారం రావడంతో, రైడ్స్‌కు ఎక్సైజ్ పోలీసులు సిద్ధమయ్యారు. అయితే విజయ్ మద్దూరిని ఆహ్వానించింది కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల కావడంతో, అది ఫ్యామిలీ పార్టీగా నిఘా విభాగానికి నిర్ధారణ అయ్యింది. ఈ పార్టీకీ ఖచ్చితంగా కేటీఆర్ హాజరవుతారని ఆ సమయంలోనే సోదాలు నిర్వహించి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని పోలీసులు ముందస్తుగానే నిర్ణయం తీసుకున్నారు. కానీ అక్కడ కేటీఆర్ చిక్కకపోవడంతో ప్లాన్ బెడిసికొట్టింది. పోలీసుల తొందరపాటు చర్య కారణంగా కేటీఆర్ ఆ పార్టీలో ఉన్నాడో లేడో పూర్తిస్థాయిలో నిర్ధారించుకోకుండానే, తొందరపడి అక్కడికి చేరుకోవడంతో అసలు వ్యూహం అమలుకాకుండా పోయింది.

3

లెక్కలు తేలాల్సిందే

వచ్చే ఏడాది జనగణన

- 2021లో కరోనా వైరస్ కారణాం జరగని జనగణన
- మూడేళ్లుగా వివిధ కారణాలతో ప్రక్రియ వాయిదా
- 2028లో పూర్తికానున్న ఎంపీ స్థానాల పునర్విభజన

జనగణనకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు నేషనల్ పాపులేషన్ రిజిస్టర్-ఎన్‌పీఆర్‌ను అప్డేట్ చేసే ప్రక్రియ వచ్చే ఏడాది ప్రారంభమవుతుందని సంబంధిత వర్గాల సమాచారం. ఈ ప్రక్రియ 2026 వరకు జరగనుందని తెలుస్తోంది. 2026 ఏడాది చివర్లో పూర్తి వివరాలు ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. అయితే వచ్చే ఏడాది జరిగే జనగణనతో భవిష్యత్ సెన్సస్ సైకిల్స్ మారే అవకాశం ఉంది. అంటే ఈ జనగణన 2025-2035 కాలానికే చేపడితే, వచ్చేసారి 2035-2045 కాలానికి లెక్కిస్తారు. ఇదిలా ఉండగా, కులగణనపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది.

జనాభా లెక్కలు- 31 ప్రశ్నలు

ఈ సారి జనగణనలో ప్రజలను అడిగే 31 ప్రశ్నలను రిజిస్ట్రార్ జనరల్,

2

ప్రతి కదలికపై నిఘా

పోస్టులు పెట్టినా, లైకులు కొట్టినా ఇంటికే.

- సచివాలయ పోలీస్ సిబ్బందికి హెచ్చరికలు
- సోషల్ మీడియాలో అలాంటి పోస్టులు పెట్టొద్దని వార్నింగ్
- మెమో జారీ చేసిన సెక్యూరిటీ చీఫ్ ఆఫీసర్

సచివాలయంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి.. సెక్రటేరియట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేఖంగా.. సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టినా.. వేరే వ్యక్తులు పెట్టిన పోస్టులకు లైకులు, కామెంట్లు చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ.. మెమో జారీ చేశారు. పోలీస్ సిబ్బంది ప్రతి కదలికపై నిఘా పెట్టినట్టు పేర్కొన్నారు. ఏమాత్రం తప్పు చేసినట్టు తెలిసినా.. ఇంటికి పంపించనున్నట్టు హెచ్చరించారు. ఈ మేరకు జారీ చేసిన మెమో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం టీజీఎస్పీ పోలీసు కానిస్టేబుళ్లు, వారి కుటుంబాలు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో.. సచివాలయ పోలీస్ సిబ్బందికి ఈ హెచ్చరికలు జారీ చేయటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సచివాలయ సెక్యూరిటీ చీఫ్ ఆఫీసర్ జారీ చేసిన మైమోలోని సారాంశం

1) రాష్ట్రానికి అతిముఖ్యమైన సచివాలయం నందు మనం విధులు నిర్వర్తిస్తున్నాం. కనుక మన మీద చాల మందికి నిఘా ఉంటుంది. ఇక్కడ విధులు నిర్వర్తించే వారు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు, ఏ పోస్టులు పెడుతున్నారు. ఇలా ఇంకా చాలా విషయాల

2

ఇజ్రాయెల్-గాజా యుద్ధం

43వేల మంది మృతి

- లక్ష మందికి గాయాలు
- గాజాలోని ఆస్పత్రి భూగర్భంలో 100మంది హమాస్ మిలిటెంట్లను బంధించిన ఐడీఎఫ్

గత ఏడాదిగా ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధం కారణంగా- గాజాలో 43,000 మంది పాలస్తీనీయులు మృతి చెందినట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. అందులో సగానికిపై మహిళలు, చిన్నారులు ఉన్నట్లు వెల్లడించింది. గత రెండు రోజులుగా ఆస్పత్రులకు వచ్చిన మృతుదేహాలతో మృతుల సంఖ్య 43,020వేలకు చేరిందని చెప్పింది.

2

ఏవియేషన్ హబ్ భారత్

వడోదరలో సి-295 విమానాల ఉత్పత్తి కర్మాగారాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

2

: గుజరాత్‌లోని వడోదరలో సి-295 సైనిక రవాణా విమానాల ఉత్పత్తి కోసం ఏర్పాటు చేసిన కర్మాగారాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం కర్మాగారంలోని విశేషాలను ఎయిర్‌బస్ సంస్థకు చెందిన ఉద్యోగులు ప్రధానికి వివరించారు. ఈ కార్యక్రమంలో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్ పటేల్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పాల్గొన్నారు. అంతకుముందు ప్రధాని మోదీ, సాంచెజ్ కలిసి ఓపెన్ జీప్‌లో విమానాశ్రయం నుంచి టాటా ఎయిర్ క్రాఫ్ట్ కాంప్లెక్స్ వరకు రోడ్ షోను నిర్వహించారు.

నగరంలో ఆంక్షలు

ఇంటెలిజెన్స్ నివేదికలతో సర్కారు యాక్షన్

ఇటు నిరుద్యోగులు.. అటు మూసీ బాధితులు మధ్యలో బెటాలియన్ స్పెషల్ పోలీసుల రగడ

ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ ఆదేశాలు

2

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది. హైడ్రా ఏర్పాటుతో చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాపాడే సరికొత్త యజ్ఞానికి తెరలేసింది. సర్కారు చర్యలపై సామాన్యులు హ్యాపీగా ఫీల్ అయ్యారు. కానీ, మూసీ ప్రక్షాళనతో మధ్యతరగతి కుటుంబాలు భగ్గుమన్నాయి. జీవో 29తో నిరుద్యోగుల్లో అసంతృప్తి జ్వాల రగిలింది. మరోవైపు బెటాలియన్లలో పనిచేస్తున్న కానిస్టేబుళ్లను కూలీలుగా మార్చిన తీరు ఆయా కుటుంబాల్లో ఆవేదనకు గురిచేసింది. వన్ పోలీస్.. వన్ స్టేట్ అనే నినాదంతో

వామ్మో..మోమోస్..!

మోమోస్ తిని ఓ మహిళ మృతిచెందగా మరో 50 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో చోటుచేసుకుంది. అస్వస్థతకు గురైన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు బాధితుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరీ శంకర్ కాలనీలో శుక్రవారం జరిగిన సంతలో మోమోస్ విక్రయించారు.

సింగాడకుంట బస్తీకి చెందిన రేష్మ బేగం (31)తో పాటు ఆమె పిల్లలు, ఆయా బస్తీల్లోని సుమారు 50 మంది వీటిని తిన్నారు. వీరందరికీ శనివారం నుంచి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో బంజారాహిల్స్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని పలు ఆస్పత్రుల్లో చేరారు. వీరిలో కొందరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. మోమోస్ తిన్నవారిలో దాదాపు 10 మంది పిల్లలు ఉన్నారు. రేష్మ బేగం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో ఆమె దురదృష్టవశాత్తు మృతి చెందారు.

ఈ ఘటనలో మోమోస్ తయారు చేసిన సంస్థను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. ఒకరి మృతికి కారణమైన మోమోస్ శాంపిల్స్‌ను అధికారులు సేకరించారు. వీటిని చింతలబస్తీలో మోమోస్ తయారు చేసినట్లు గుర్తించి శాంపిల్స్ సేకరణ చేశారు. వీటి తయారీకి ఎలాంటి అనుమతులు లేనట్లు జీహెచ్ఎంసీ అధికారులు తేల్చారు.

మయోనైజ్ పైనే అనుమానం?

ఈ సంఘటనపై ఇప్పటికే బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో మోమోస్ విక్రయించిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. మోమోస్‌తో పాటు ఇచ్చే మయోనైజ్, మిర్చి చట్నీ కలుషితమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మోమోస్‌తో పెద్ద పెద్ద రెస్టారెంట్లు మంచి లాభదాయక వ్యాపారాలు చేస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో మల్టీప్లెక్స్‌ల్లో ఈ మోమోస్ కోసం చాలా మంది వెళుతున్నారు.

ప్రతి కదలికపై నిఘా

మీద. కావున ఇక్కడ సిబ్బంది ఒక్కరు కూడా అనవసరమయిన విషయాల్లో జోక్యం చేసుకోకండి. ఏ ఒక్కరు తప్పు చేసిన అందరి మీద ప్రభావం పడుతుంది.

2) ఈ రోజు నుంచి సచివాలయం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ అమలులో ఉంది. కావున ఐదుగురి కంటే ఎక్కువుగా గుమిగూడి ఉన్నా, ధర్నాలు, రాస్తారోకోలు, సచివాలయ ముట్టడి లాంటి వాటిలో పాల్గొంటే.. వారి మీద చట్టపరమయిన చర్యలు తీసుకోబడతాయి. కావున మీ కుటుంబ సభ్యులకు, బంధువులకు, మిత్రులకు, తోటి సిబ్బందికి తెలియపర్చండి.

3) మీరు చాల వాట్సాప్ గ్రూప్‌లలో అడ్మిన్‌గా ఉంటూ, మిగతా సిబ్బందిని గ్రూప్‌లో యాడ్ చేస్తూ టీజీఎస్పీ వ్యవస్థ గురించి, పోలీస్ ఆఫీసర్స్ గురించి రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడుతున్నారు. కానీ మీ ప్రతి కదలికల మీద నిఘా పెట్టారు. కావున అందరు కూడా తక్షణమే అటువంటి గ్రూప్స్ నుంచి ఎగ్జిట్ అవ్వండి.

తెలంగాణ పోలీస్ శాఖ సంచలన నిర్ణయం.. ఆ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

4) మీరు, మీ కుటుంబ సభ్యులు కూడా ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు మొదలైన అనుమతి లేని కార్యక్రమాల్లో పాలొనవద్దు. అలా చేయడం వల్ల చాల ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది.

5) మీరు ముఖ్యంగా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ అనగా టెలిగ్రామ్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్, వాట్సప్‌లో టీజీఎస్పీ వ్యవస్థ గురించి, పోలీస్ ఆఫీసర్స్ గురించి, గవర్నమెంట్‌కి వ్యతిరేకంగా, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం, షేర్ చేయడం, కామెంట్ చేయడం, లైక్ చేయడం లాంటివి చేయవద్దు. మీ ప్రతి కదలికల మీద నిఘా పెట్టారు. పొరపాటున మీరు దొరికితే తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోబడును.

చివరగా చెప్పేది ఏమనగా.. పైన పేర్కొన్న విషయాలు దృష్టిలో ఉంచుకుని సచివాలయలో విధులు నిర్వర్తించే టీజీఎస్పీ ఆఫీసర్స్, సిబ్బంది దయచేసి ఎవరు కూడా పైన తెలియజేసిన విషయాల్లో కలుగచేసుకోకండి. ఏమైనా తప్పు జరిగితే తక్షణమే శాఖపరమైన చర్యలు తీసుకోబడును.

సచివాలయంలో ఏ చిన్న తపిదం జరిగినా, చేసినా దాని యొక్క ప్రభావం టీజీఎస్పీ వ్యవస్థ మీద పడుతూ.. అందరం కూడా ఇక్కడ నుండి వెళ్లాల్సి ఉంటుంది." అంటూ సచివాలయ సెక్యూరిటీ చీఫ్ ఆఫీసర్ మెమోలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఓ కాపీ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

వీసా లేకుండా రష్యా పర్యటన

వీసా లేకుండా భారతీయులు రష్యా పర్యటించే అవకాశం త్వరలో అందుబాటు లోకి రానుంది. ఈమేరకు కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన ఒప్పందాలు కీలక దశలో ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో 2025 స్ప్రింగ్ సీజన్ నుంచి వీసాఫ్రీ సదుపాయం అందుబాటు లోకి వచ్చే అవకాశం ఉన్నట్టు రష్యాకు చెందిన ఉన్నతాధికారి ధ్రువీకరించారు. దీనివల్ల భారత్ నుంచి పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగనున్నట్టు అంచనా వేస్తున్నామని మాస్కో సిటీ టూరిజం కమిటీ ఛైర్మన్ ఎవ్జెనీ కోజ్లోవ్ తాజాగా వెల్లడించారు. " టూరిజం విషయంలో రష్యాకు భారత్ ఇప్పటికే కీలక మార్కెట్‌గా అవతరించింది.

ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే 28,500 మంది భారతీయులు మాస్కోలో పర్యటించారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఈ సంఖ్య ఒకటిన్నర రెట్లు పెరిగింది. వాణిజ్యం, వ్యాపార సంబంధిత కారణాలతో రష్యాలో పర్యటించడం ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా సుదీర్ఘ సంబంధాల దృష్ట్యా భారత్‌ను కీలక మార్కెట్‌గా పరిగణిస్తున్నాం " అని మాస్కో అధికారి పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు 1 నుంచి భారత్ నుంచి రష్యా వచ్చే ప్రయాణికులు ఈ వీసా దరఖాస్తు చేసుకునే (నాలుగు రోజుల్లో జారీ అవుతుంది) వెసులుబాటు అందుబాటు లోకి వచ్చింది. సంఖ్యాపరంగా గత ఏడాది అత్యధిక వీసాలు పొందిన తొలి ఐదు దేశాల్లో భారత్ నిలిచింది. గత ఏడాది మొత్తం 9500 భారత పర్యాటకులకు ఈ వీసాలు జారీ అయ్యాయి. రష్యాకు వచ్చే విదేశీ పర్యాటకుల్లో ఇది ఆరు శాతమని మాస్కో అధికారులు వెల్లడించారు.

ధర ధమాల్

వరంగల్: వరంగల్, ఖమ్మం పత్తి మార్కెట్లకు సోమవారం పెద్ద ఎత్తున పత్తి బస్తాలు వచ్చాయి. రెండు రోజుల సెలవుల అనంతరం మార్కెట్ తెరచుకోవడంతో మార్కెట్లకు పత్తి పోటెత్తింది. ఖమ్మం మార్కెట్‌కు ఖమ్మంతో పాటు పొరుగు జిల్లాల నుంచి రైతులు పెద్దమొత్తంలో పత్తి బస్తాలు తీసుకొచ్చారు. అయితే.. పత్తి ధర భారీగా పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలు ధర 6200 దాటడం లేదని అంటున్నారు. మార్కెట్ అధికారులు వ్యాపారులు కుమ్మక్కయ్యారని ఆరోపిస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎనుమాములలోనూ అంతే..

వరంగల్ జిల్లాలోని ఎనుమాముల మార్కెట్‌కు పత్తి భారీగా వచ్చింది. అయితే.. బహిరంగ మార్కెట్లో పత్తి ధరలు మాత్రం రోజురోజుకు తగ్గుతున్నాయి. శుక్రవారం నాటికంటే 200 ధర తగ్గిందని రైతులు చెబుతున్నారు. కూలీలు, రవాణా ఖర్చులు బాగా పరిగాయని, తేమ శాతం పేరుతో ధర తక్కువగా ఇస్తుండటంతో నష్టపోతున్నామని వాపోతున్నారు. వ్యాపారులంతా సిండికేట్ అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మార్కెట్ అనే పేరే తప్ప తమకేమీ లాభం లేదని చెప్పారు. వర్షాల వల్ల ఈ సారి పత్తి దిగుబడి తగ్గిందని వెల్లడించారు.

రోడ్డుపై కుప్పలుగా

ఏదో పని మీద నడుచుకుంటూ వెళ్తుంటే.. రోడ్డుపై రూపాయి బిల్ల మెరుస్తూ కనిపించింది. వెంటేనే దాన్ని తీసుకుని తుడిచి.. కళ్లకు అద్దుకుని జేబులో వేసుకుని.. ఆరోజు మంచి జరుగుతుంది అని నమ్ముతుంటారు చాలా మంది. మరి అదే రూపాయి బిల్ల స్థానంలో 500 రూపాయల నోటు కనిపిస్తే.. అది తీసుకునేందుకు వెళ్లేటప్పటికి దానిలాగే చాలా నోట్లు రోడ్డుపై పరిచినట్టుగా కనిపిస్తే.. ఆ ఊహ ఎంత బాగుందో అనుకుంటున్నారా. అచ్చంగా అలాంటి సన్నివేశమే నిజమాబాద్ జిల్లా వేల్పూరు మండలం అక్సాంపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది.

జాతీయ రహదారి పక్కన 100 రూపాయలు, 500 రూపాయల నోట్లు కుప్పలు తెప్పలుగా కనిపించారు. చెట్ల కింద ఆకులు రాలినట్టుగానే.. రోడ్డు పక్కన పరిచినట్టుగా నోట్లు కనిపించాయి. రూపాయో, రెండు రూపాయలో కనిపిస్తేనే కళ్లకద్దుకుని తీసుకునే జనాలు.. 100, 500 రూపాయల నోట్లు కనిపిస్తే ఆగుతారా. ఎగబడి మరీ ఏరుకున్నారు. ఆ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లే వాళ్లు ఎగబడిపోయారు. ఒకరిని తోసుకుంటూ ఒకరు నోట్లను జేబుల్లో నింపుకున్నారు. ధనలక్ష్మి తలుపు తట్టిందనుకుని.. జేబు నిండా నోట్లతో.. మనసు నిండా సంతోషంతో ఇళ్లకు వెళ్లారు.

అయితే.. ఇంటికి వెళ్లే మార్గంలో ఆ డబ్బును ఎలా ఖర్చుపెట్టాలన్న లెక్కలు వేసుకుంటూ వెళ్లి.. తమ కుటుంబ సభ్యులకు సంతోషంలో విషయం చెప్పారు. కానీ.. పోకిరి సినిమాలోని క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్‌ను మించిన ట్విస్ట్ వారికి కనిపించింది. వారి కళ్లలో సంతోషం ఒక్కసారిగా ఆవిరైపోయింది. రోడ్డుపై కనిపించినప్పుడు ఆదరా బాదరాగా.. వేరే వాళ్లకు దొరకుండా.. ఏరుకున్నోడికి ఏరుకున్నన్ని అన్నట్టుగా పోటీ పడి నోట్లను జేబుల్లో కుక్కుకున్న ఆ జనాలు.. ఇంటికెళ్లి ప్రశాంతంగా ఆ నోట్లను గమనిస్తే అసలు విషయం బయటపడింది. వాళ్లకు దొరికిన నోట్లు అసలువి కావు.. నకిలీవని తేలింది. ఈ విషయం తెలియటంతో.. కళ్లు తేలేయటం వారి వంతైంది.

దీంతో.. ఈ నోట్ల వ్యవహారం గ్రామంలో తీవ్ర చర్చకు తెరలేపింది. అసలు నకిలీ నోట్లు ఎవరివి.. కావాలనే పడేశారా.. లేదా తీసుకెళ్తుంటే పొరపాటున అక్కడ పడిపోయాయా.. ఆ ఏరియాలో నకిలీ నోట్ల దందా నడుస్తుందా.. లేదా అవి పిల్లలు ఆడుకునే నోట్లా అన్న రకరకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పోలీసులకు చేరటంతో.. రంగంలోకి దిగిన పోలీసులు రకరకాలు కోణాల్లో విచారణ చేస్తున్నారు. అయితే.. ఆ నోట్లు చూసి.. ఆశగా తీసుకున్న వ్యక్తులు మాత్రం తీవ్ర నిరాశకు గురయ్యారు. పంట పండింది అనుకునేలోపే పెద్ద వరదొచ్చి కొట్టుకుపోయినట్టుగా వాళ్ల ఆశలన్ని గాల్లో కలిసిపోయాయి.

లెక్కలు తేలాల్సిందే

సెన్సస్ కమిషనర్ కార్యాలయం ఇప్పటికే సిద్ధం చేసింది. క్రితం సారి జనాభా లెక్కింపులో అడిగినట్లు కుటుంబ పెద్ద ఎస్‌సీ లేదా ఎస్‌టీ సామాజిక వర్గానికి చెందినవారా కాదా అని అడుగుతారు. కుటుంబంలో నివసించే వ్యక్తుల సంఖ్య, కుటుంబ పెద్ద మహిళా కాదా, ఇంట్లో నివాసం ఉండే గదుల సంఖ్య, కుటుంబంలో పెళ్లైన జంటల సంఖ్య వంటి ప్రశ్నలు అడుగుతారు. వీటితో పాటు కుటంబానికి టెలిఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్, మొబైల్/స్మార్ట్‌ఫోన్, సైకిల్, స్కూటర్ లేదా మోటార్ సైకిల్, మోపెడ్, కారు, జీప్ లేదా వ్యాన్ వంటి వాహనాలున్నాయా అనే ప్రశ్నలు అడుగుతారు.

జనగణన తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభమవుతుందని, అది 2028కి ముగుస్తుందని తెలుస్తోంది. అయితే దీనిపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో విజయం సాధించినందున, తమ రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలను కోల్పోయే అవకాశం ఉందని దక్షిణాది రాష్ట్రాల రాజకీయ నేతలు తమ ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల దేశ రాజకీయాల్లో దక్షిణాదికి ప్రాధాన్యం తగ్గుతుందని వారు భావిస్తున్నారు.

కులగణనకు విపక్షాల పట్టు

అయితే జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని ఆర్‌జేడీ, కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలు పట్టుబడుతున్నాయి. ఈసారి జరగనున్న జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందా లేదా, లోక్‌సభలో రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని నిర్ణయించేందుకు ఈ లెక్కలు ఉపయోగిస్తారా లేదా అని అంశాలపై కాంగ్రెస్ స్పష్టత కోరింది. ఇందుకోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్రానికి సోమవారం సూచించింది.

ఈ కొత్త సెన్సస్‌లో 1951 నుంచి ప్రతి సెన్సస్‌లో అడుగుతున్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలతోపాటు దేశంలోని అన్ని కులాల వివరణాత్మక గణన కూడా ఉంటుందా? అని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. భారత రాజ్యాంగం ప్రకారం, అలాంటి కులగణన చేపట్టడం కేంద్ర ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు.దేశంలో జనగణన ప్రతి పదేళ్లకొకసారి ఆనవాయితీగా నిర్వహించాల్సి ఉంటుంది. కొవిడ్ కారణంగా 2021లో ఆగిన జనగణన- ఆ తర్వాత ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వస్తోంది. రాష్ట్రాలవారీగా, జాతీయస్థాయిలో వేర్వేరు పథకాలకు సంబంధించి 2011 నాటి గణాంకాల ఆధారంగానే లక్ష్యాలు, వ్యయ అంచనాలు రూపొందిస్తున్నారు. తొమ్మిదేళ్ల వ్యవధిలో దాదాపు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని ఇటీవల నీతి ఆయోగ్ లెక్కలు వెల్లడించాయి. సరైన గణాంకాలు లేకుండా ఈ ప్రకటన చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

జనాభా లెక్కల్లో అడిగే మరికొన్ని ప్రశ్నలు

ఇంట్లో తినే తృణధాన్యాలు ఏమిటి
తాగునీటికి ప్రధాన వనరుల వివరాలు
ప్రధాన లైటింగ్ సోర్స్ వివరాలు
మరుగుదొడ్లు, మరుగుదొడ్డి రకం
వ్యర్థ జలాల నిర్వహణ సౌకర్యం, స్నానపు సౌకర్యాల లభ్యత
వంటగది, కనెక్షన్ లభ్యత, వంట కోసం ఉపయోగించే ప్రధాన ఇంధనం
రేడియో, ట్రాన్సిస్టర్, టెలివిజన్ లభ్యత మొదలైనవి.
లోక్‌సభ స్థానాల పునర్విభన- దక్షిణాది ఆందోళన?

ఏవియేషన్ హబ్ భారత్

ఈ కర్మాగారంతో ఇరుదేశాల బంధం మరింత బలోపేతం

వడోదరలో ఏర్పాటైన సి-295 విమానాల కర్మాగారం భారత్, స్పెయిన్ దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వడోదరలో తయారయ్యే విమానాలు భవిష్యత్తులో ఇతర దేశాలకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. వడోదరలో ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ప్రాజెక్ట్ మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్ మిషన్‌ను కూడా బలోపేతం చేస్తుందని తెలిపారు.

స్పెయిన్‌లో యోగా కూడా బాగా ప్రాచుర్యం పొందిందని తాను విన్నానని ప్రధాని మోదీ తెలిపారు. స్పెయిన్ ఫుట్‌బాల్ టీమ్‌ను భారతీయులకు చాలా ఇష్టపడతారని చెప్పుకొచ్చారు. ఇది నా స్నేహితుడు పెడ్రో శాంచెజ్ మొదటి భారతదేశ పర్యటన. ఇకనుంచి మేము భారత్- స్పెయిన్ భాగస్వామ్యానికి కొత్త దిశను అందిస్తున్నాం. సి-295 విమానాల ఉత్పత్తి కర్మాగారాన్ని ప్రారంభించాం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

2026 నాటికి తొలి విమానం

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ నుంచి మొదటి విమానం 2026లో అందుబాటులోకి వస్తుందని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తెలిపారు. ప్రధాని మోదీ దార్శనికత భారత్‌ను పారిశ్రామిక శక్తిగా మార్చిందని కొనియాడారు. వడోదరలో ఏర్పాటైన ఈ కర్మాగారం ఇతర ఐరోపా దేశాలు భారత్‌కు వచ్చేందుకు ద్వారాలు తెరిచిందని వ్యాఖ్యానించారు. ఎయిర్ బస్, టాటా భాగస్వామ్యం భారత వైమానిక రంగ పురోగతికి బాటలు వేస్తుందన్నారు.

రెండేళ్లలో పూర్తి చేస్తాం

నేటి నుంచి కచ్చితంగా రెండేళ్లలో తొలి విమానం డెలివరీ చేస్తామని ప్రధానికి హామీ ఇచ్చారు టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్. ఆ రోజు మళ్లీ ప్రధాని ఇక్కడికి వచ్చి దానిని ఆవిష్కరించేందుకు వీలుగా తేదీని రిజర్వ్ చేయాలని పీఎంఓను కోరినట్లు తెలిపారు. టాటా గ్రూప్‌నకు చెందిన 200 మంది ఇంజినీర్లు ఇప్పటికే స్పెయిన్‌లో శిక్షణ పొందుతున్నారన్నారు. తాము 40ఎస్ ఎంఈలతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు కోసం 2012 నుంచే దివంగత రతన్ టాటా కృషి చేసినట్లు వెల్లడించారు. ఎయిర్ బస్ సంస్థతో స్నేహ సంబంధాలు నడిపి ఈ భాగస్వామ్యానికి పునాది వేశారన్నారు.

2022లోనే మోదీ శంకుస్థాపన

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌కు చెందిన ఈ కర్మాగారానికి 2022 అక్టోబరులో మోదీ శంకుస్థాపన చేశారు. భారత్‌కు 40 సి-295 విమానాల సరఫరాకు 2021 సెప్టెంబరులో రూ.21,935 కోట్ల ఒప్పందం కుదిరింది. ఇందులో 16 విమానాలు స్పెయిన్‌లోని ఎయిర్‌బస్ సంస్థ కర్మాగారం నుంచి అందుతాయి. మిగతావి వడోదర యూనిట్‌లో సిద్ధమవుతాయి. కాలం చెల్లిన ఆవ్రో-748 విమానాల స్థానంలో భారత వాయుసేన వీటిని ప్రవేశపెట్టనుంది.

43వేల మంది మృతి

ఈ యుద్ధం మొదలైన 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి 1,01,110 మంది గాయపడినట్లు పేర్కొంది. అయితే మృతుల్లో ఎంతమంది పౌరులు, మిలిటెంట్లు ఉన్నారనే వివరాలు వెల్లడించలేదు.

గాజా స్ట్రిప్‌లోని ఓ ఆస్పత్రి భూగర్భంలో భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్న దృశ్యాలను ఇజ్రాయెల్ మిలిటరీ విడుదల చేసింది. హమాస్ మిలిటెంట్ల గాలింపులో భాగంగా గాజా స్ట్రిప్‌లోని కమల్ అద్వాన్ ఆస్పత్రిపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ భద్రతా దళం-ఐడీఎఫ్ తెలిపింది. అక్కడ జరిగిన సోదాల్లో ఆస్పత్రి భూగర్భంలో భారీగా ఆయుధాలు లభించినట్లు పేర్కొంది. ఆ ప్రాంతంలో సుమారు 100 మంది హమాస్ మిలిటెంట్లను బంధించినట్లు తెలిపింది. పౌరుల తరలింపు సమయంలో వారిలో కొందరు తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు వెల్లడించింది. కమల్ అద్వాన్‌లోని 88 మంది రోగులను, వారి సంరక్షకులను, సిబ్బందిని గాజా స్ట్రిప్‌లోని వేరే ఆస్పత్రికి తరలించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

ఇజ్రాయెల్‌కు ఇరాన్ హెచ్చరిక!

ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడులు చట్టవిరుద్ధమని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ చీఫ్ జనరల్ హుస్సేన్ సలామీ అన్నారు. ఈ దాడులు చేసిన వారి ఊహలకు అందని పర్యవసనాలు ఉంటాయని హెచ్చరించారు.

తగ్గిన ముడిచమురు ధర

సోమవారం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గాయి. యూఎస్ క్రూడ్, బ్రెంట్ క్రూడ్ ధరలు 6 శాతం పడిపోయాయి. అందరూ భయపడినట్లుగా ఇజ్రాయెల్ ఇరాన్ చమురు ఉత్పత్తి ప్రాంతాల్లో దాడులు జరపలేదు. ఇరాన్ మిలిటరీ బేస్‌లపై దాడులు చేసింది. దీంతో చమురు ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం ఉండదనే సంకేతాల మధ్య ఆయిల్ ధరల్లో తగ్గుదల కనిపించింది.

అక్టోబర్ 2న ఇరాన్- ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేసింది. దీంతో పశ్చిమాసియాలో యుద్ధం విస్తరిస్తుందన్న భయాల నడుమ ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అమెరికా తర్వాత ఇరాన్ 7వ అతిపెద్ద చమురు ఉత్పత్తిదారుగా ఉంది.

ఇరాన్‌పై దాడి చేసేందుకు ఇజ్రాయెల్ తమ గగనతలాన్ని ఉల్లంఘించిందని ఇరాక్ ఆరోపించింది. తమ దేశ సార్వభౌమధికారాన్ని అతిక్రమించిందని చెప్పింది.

బుచ్చమ్మది ప్రభుత్వం చేసిన హత్యే

హైదరాబాద్ : బుచ్చమ్మది కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైడ్రా కూల్చివేతల భయంతో కూకట్‌పల్లి యాదవ బస్తీలో గుర్రంపల్లి బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. బుచ్చమ్మ కుటుంబాన్ని ఇవాళ కేటీఆర్ పరామర్శించారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ నేత కేటీఆర్ భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేటీఆర్ కీలక కామెంట్స్ చేశారు. ఇది ఆత్మహత్య కాదు.. రేవంత్ సర్కార్ చేసిన హత్య అంటూ మండిపడ్డారు

''అర్థం, పర్థం లేకుండా ఆనాలోచితంగా గుడ్డెద్దు చేలో పడినట్లు ఇష్టమొచ్చినట్లు కూకట్ పల్లిలోని నల్ల చెరువు వద్ద కూల్చివేతలు చేశారు. హైడ్రా అనే బ్లాక్ మెయిల్ సంస్థను పేదల మీదకు ఉసిగొల్పి నోటీసులు ఇవ్వకుండానే మీ ఇళ్లు కూలగొడుతామంటూ భయానక వాతావరణం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించింది. పిల్లలు పుస్తకాలను తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా పేదల ఇళ్లు కూలగొడుతున్నారు.

ఎక్కడ నా ఇల్లు కూలగొడుతారేమోనని బుచ్చమ్మ అనే మహిళ మూడు రోజులుగా ఆందోళన చెంది ఆత్మహత్య చేసుకున్నారు. వాళ్ల కుటుంబాన్ని చూస్తే బాధనిపిస్తోంది. ఎంతో కష్టపడి మా బిడ్డలకు ఉపయోగపడతదని ఇళ్లు కట్టామని బుచ్చమ్మ కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

వాళ్లే పర్మిషన్లు ఇచ్చి ట్యాక్స్ కట్టించుకొని వాళ్లే ఇల్లు కూలగొడుతారంట. హైడ్రా అనే సంస్థ కారణంగానే బుచ్చమ్మ బలవన్మరణం పొందారు. ఇది ఆత్మహత్య కాదు హైడ్రా అనే అరాచక సంస్థతో రేవంత్ రెడ్డి చేయించిన హత్య. మీ దిక్కుమాలిన చర్యల కారణంగా పేదలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

వేదశ్రీ అనే పాప ఏడుస్తూ పుస్తకాలు తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా ఇళ్లు కూలగొట్టారు. ఇంత అమానవీయంగా ప్రవర్తించాలా ? ఈ రాష్ట్రంలో పేద వాళ్లకు మాత్రమే చట్టాలున్నాయా ? రేవంత్ రెడ్డి నీ అన్నకు మాత్రం ఎఫ్టీఎల్ లో ఉన్న ఇల్లుకు నోటీసులిస్తారా ? పేదవాళ్లు పుస్తకాలు తీసుకుంటామంటే కూడా తీసుకోనివ్వకుండా ఇల్లు కూల్చుటమనేది ఇంతకంటే దిగజారిన, దిక్కుమాలిన చర్య ఏదైనా ఉంటుందా ? ఎన్నో హామీలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కడతాం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అన్నారు. ఒక్క ఇళ్లు కట్టలేదు. కానీ ఎన్ని ఇళ్లు కూలగొట్టావో ప్రజలు గమనిస్తున్నారు. హైదరాబాద్ లో మాత్రమే కాదు ఊళ్లలో కూడా రేవంత్ రెడ్డి అరాచకం గురించి మాట్లాడుతున్నారు. నువ్వు నీ కేబినెట్

మంత్రులు ఏం చేస్తున్నారో ప్రజలంతా చూస్తున్నారు.

హైడ్రాతో ఆర్థిక మంత్రికి ఏంటీ సంబంధం. ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాడు. ఐదు మంది బిల్డర్ల పేరు చెబుతాడు. ఎందుకిదంతా బ్లాక్ మెయిల్ దందానా ? నీ మంత్రులు, నీ తమ్ముళ్లకు ఇదే దందానా ? పెద్ద పెద్ద బిల్డర్లను బెదిరించి వాళ్ల దగ్గర దందా చేసి చందాలు తీసుకోవటానినా నీ ప్రభుత్వం ఉన్నది. గరీబోళ్ల ఇళ్లు కూలగొట్టి హైడ్రా పేరుతో దందా చేస్తున్నారు. ఈ హత్య



జేఈఈ షెడ్యూల్ వచ్చేసింది

- జేఈఈ షెడ్యూల్ విడుదల చేసిన ఎన్‌టీఏ
- రెండు సెషన్లుగా పరీక్షలు
- సెషన్-1 జనవరిలో, సెషన్-2 ఏప్రిల్‌లో నిర్వహించనున్న ఎన్‌టీఏ

ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ పరీక్షా షెడ్యూల్ విడుదలైంది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను జేఈఈ పరీక్షలను రెండు దఫాల్లో నిర్వహించనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ - ఎన్‌టీఏ తెలిపింది. తొలిదఫా పరీక్షలను 2025 జనవరిలో, రెండో దఫా ఏప్రిల్‌లో నిర్వహిస్తామని స్పష్టం చేసింది. జనవరిలో జరగనున్న పరీక్షల కోసం నేటి నుంచి నవంబర్ 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొంది.

పరీక్షలను నిర్వహించనున్న కేంద్రాల వివరాలను జనవరి మొదటి వారం లోపు ప్రకటిస్తామని ఎన్‌టీఏ తెలిపింది. జనవరి 22 నుంచి 31 తేదీల్లో జేఈఈ తొలిదఫా పరీక్షలు నిర్వహించి, ఫిబ్రవరి 12 లోపు ఫలితాలు విడదల చేస్తామని పేర్కొంది. మొత్తం 13 భాషల్లో పరీక్ష నిర్వహించనున్న ఎన్‌టీఏ సిలబస్‌ని సైతం ఖరారు చేసింది. మరింత సమాచారం కోసం అభ్యర్థులు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌ని సందర్శించాలని పేర్కొంది.

టాప్ ర్యాంక్ దక్కించుకున్న వారికే ఐఐటీ, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశం : గత ఏడాది సెషన్ -1 ను జనవరి 24న తేదీన నిర్వహించారు. ఈసారి 2 రోజులు ముందుకు జరిపి 22 నుంచి నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ టెస్ట్ కోసం సుమారు 14లక్షల మందికి పైగానే పోటీ పడుతుంటారు. ఇందులో టాప్ ర్యాంక్ దక్కించుకున్న వారికే ఐఐటీ, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశం లభిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే అత్యంత కఠినమైన ప్రవేశ పరీక్షల్లో ఐఐటీ జేఈఈ ఎగ్జామ్ టాప్ -2లో ఉంది. టాప్ -1లో చైనాలో 'గవోకావో' పరీక్ష మొదటి స్థానంలో ఉంది.

సీఎం కాన్వాయ్‌కి ప్రమాదం

ముఖ్యమంత్రి వాహనాన్ని ఢీ కొట్టిన పోలీస్ ఎస్కార్ట్

కేరళ సీఎం పినరయి విజయన్ కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. తిరువనంతపురం జిల్లా వామనపురం వద్ద సోమవారం సాయంత్రం 6.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కాన్వాయ్‌లోని ఐదు వాహనాలు వెనుక నుంచి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇందులో పోలీసు ఎస్కార్ట్, ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న కారు, అంబులెన్స్ కూడా ఉండడం గమనార్హం. అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. దీంతో ముఖ్యమంత్రిని అక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఇలా జరిగింది!

సీఎం కాన్వాయ్ ప్రయాణిస్తున్న అదే రోడ్డులో ఓ మహిళ స్కూటీపై వెళ్తోంది. ఆమె నడి రోడ్డుపై మలుపు తీసుకుంటుండగా వెనుకవైపు నుంచి వచ్చిన సీఎం కాన్వాయ్‌లోని పోలీసు వాహనం ఒక్కసారిగా ఆగింది. ఇక కాన్వాయ్‌లో వెనుక నుంచి వస్తున్న వాహనాలు కంట్రోల్ అవ్వలేదు. సడెన్ బ్రేక్స్ వేసినా ఫలితం లేకపోయింది. దీంతో వరుసగా ఐదు వాహనాలు ఒక్కదాన్ని మరొకటి ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో అంబులెన్స్ కూడా కాస్త డ్యామేజ్ అయ్యింది.

ఇక వెంటనే అప్రమత్తమైన భద్రత సిబ్బంది కారులోంచి దిగి సీఎం వాహనం వద్దకు చేరుకుంది. అయితే ముఖ్యమంత్రి కారు పెద్దగా డ్యామేజ్ కాకపోవడం వల్ల అదే వాహనంలో ఆయనను అక్కడ నుంచి వెంటనే పంపివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడం వల్ల అంతా ఊపిరి పీల్చుకున్నారు. నడిరోడ్డుపై సీఎం కాన్వాయ్ ప్రమాదానికి గురవ్వడం వల్ల స్థానికులు షాక్ అయ్యారు. కాగా, ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

నామినేషన్లు దాఖలు చేసిన మహారాష్ట్ర సీఎం, అజిత్ పవార్

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. సోమవారం రాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే, ఎన్‌సీపీ అధినేత, ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ నామినేషన్లు దాఖలు చేశారు. మరోవైపు తమ పార్టీ పోటీ చేస్తున్న స్థానం నుంచే కాంగ్రెస్ మరో అభ్యర్థిని ప్రకటించడంపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోప్రీ- పాచ్‌పాఖడీ నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే నామినేషన్ దాఖలు చేశారు. ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఇతర నేతలతో కలిసి ర్యాలీగా వెళ్లిన శిందే ఎన్నికల అధికారికి నామపత్రాలు సమర్పించారు. శిందేపై పోటీగా ఆయన రాజకీయ గురువు ఆనంద్ దిఘే మేనల్లుడు కేదార్ దిఘే దిగారు.

మరోవైపు ఎన్‌సీపీ అధినేత, ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ బారామతి నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనపై పోటీగా ఎన్‌సీపీ(ఎస్‌పీ) అభ్యర్థి యుగేంద్ర పవార్ బరిలోకి దిగారు. ఇక మంగళవారంతోనే నామినేషన్ల గడువు ముగుస్తుంది. 288 స్థానాలున్న మహారాష్ట్రలో ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు జరగనుంది. శివసేన, ఎన్‌సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడం వల్ల దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

సోలాపుర్ సౌత్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించడంపై శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ మండిపడ్డారు. మా పార్టీ అభ్యర్థిగా ఇప్పటికే అమర్ పాటిల్ పేరును ప్రకటించాం. అయినా సోలాపుర్ సౌత్ నియోజకవర్గం నుంచి దిలీప్ మానే బరిలోకి దిగుతున్నట్లుగా కాంగ్రెస్ పార్టీ తాజాగా ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాలో ఈ విధంగా ఉండటం బహుశా టైపింగ్ పొరబాటని నేను అనుకుంటున్నా. మా వైపు నుంచి కూడా అలాంటి పొరపాట్లు జరిగే అవకాశం ఉండొచ్చు. ఇక సీటు సర్దుబాటులో భాగంగా మిరాజ్ నియోజకవర్గం నుంచి స్థానిక కాంగ్రెస్ నాయకులు పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు నాకు తెలిసింది.

జస్ట్ మిస్?

బీఆర్ఎస్ పార్టీ కొద్ది రోజులుగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంది. ఏమాత్రం సమయం ఇవ్వకుడా అంశాల లోతుల్లోకి వెళ్లి మరీ బీఆర్ఎస్ నేతలు ప్రెస్ మీట్లు పెడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ నేతలకు ఎలాగైన మూకుతాడు వేయాలన్న ఆలోచనకు.. ఓ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ ఇచ్చిన ప్లాన్‌తో.. ప్రభుత్వం జన్వాడ ఫాం హౌజ్ దావత్ ఘటనపై దృష్టిపెట్టింది. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం డ్రగ్స్ కేసులో పట్టుకునేందుకు పెట్టిన నిఘాలో బీఆర్ఎస్ కీలక నేతను ఇరికించే ప్రయత్నం జరిగింది? అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

కేటీఆర్ ఉంటే..డ్రగ్ టెస్ట్ పక్కా?

పోలీసులు జన్వాడ ఫాంహౌజ్ చేరుకోవడానికి ప్రధాన కారణం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీలో ఉన్నాడని బలంగా నమ్మడమే కారణం. పక్కాగా కేటీఆర్ ఫాంహౌజ్ పార్టీలో ఉన్నారని, కేటీఆర్ కుటుంబసభ్యులు కూడా అక్కడే ఉండటంతో, కేటీఆర్ కూడా ఉన్నాడని భావించిన పోలీసులకు నిజంగా షాక్ తగిలింది. కేటీఆర్ లక్ష్యంగా స్వయంగా కేటీఆర్‌కు డ్రగ్స్ టెస్ట్ నిర్వహించాలనే లక్ష్యంతో పోలీసులు బయలుదేరినా అక్కడ సీన్ మాత్రం మరోటిలా ఉండటంతో షాక్‌కు గురయ్యారు. విజయ్ మద్దూరి కొద్దిరోజుల క్రితమే డ్రగ్స్ తీసుకున్నాడని పక్కాగా పసిగట్టిన నిఘా విభాగం.. విజయ్ మద్దూరి ద్వారా పక్కాగా కేటీఆర్‌కు కూడా డ్రగ్స్ లింకులు ఉన్నాయనే విషయాన్ని తేల్చేందుకు డ్రగ్స్ పరీక్షల నిర్వహణకు సిద్ధమయ్యారు. కానీ పోలీసులు ఊహించిన ప్రకారం.. రియాల్టీ సీన్‌లో కనిపించకపోవడంతో పోలీసులకు ఏమి చేయాలో తోచలేదు. అంతేకాకుండా కేటీఆర్‌కు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించే సమయంలో అక్కడే డ్రగ్స్ దొరికినట్లుగా ఏమైనా చిత్రకరించేవారా? లేదా? అనేది ప్రస్తుతం బీఆర్ఎస్ నేతల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

రాజ్ పాకాల ఇంట్లో సోదాలు

జన్వాడ ఫాంహౌజ్‌లో అమలు చేయాల్సిన ప్లాన్ బెడిసికొట్టడంతో, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టిన పోలీసులకు ప్రభుత్వ పెద్దల నుంచి చివాట్లు పడ్డట్లు తెలుస్తోంది. ఓ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ ఇచ్చిన తొందరపాటు సమాచారంతోనే, పోలీసుల వ్యూహం అమలు కాలేదని సమాచారం. దీంతో జన్వాడ ఫాంహౌజ్‌లో ఎలాంటి డ్రగ్స్ ఆనవాళ్లు దొరకకపోవడంతో, కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇళ్లను సెర్చ్ చేయాలని పోలీసులు నిర్ణయించుకున్నారు. వెంటనే రాయదుర్గంలోని రాజ్ పాకాల విల్లాకు చేరుకున్న బీఆర్ఎస్ నేతలు తమ సమక్షంలోనే ఇళ్లు సోదాలని చేయాలని డిమాండ్ చేయడంతో పోలీసులు చేసేదేమిలేక, బీఆర్ఎస్ నేతల సమక్షంలోనూ సోదాలు నిర్వహించినా ఎలాంటి డ్రగ్స్ ఆనవాళ్లు దొరకలేదు. మొత్తానికి కేటీఆర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా డ్రగ్స్ పార్టీలో పట్టుకోవాలనేది ప్రధాన స్కెచ్‌గా భావిస్తున్నారు. కానీ పోలీసుల అత్యుత్సాహం కారణంగా లక్ష్యం నెరవేరలేదు అనేది స్పష్టంగా తెలిసిపోయింది. ఒకవేళ కేటీఆర్ జన్వాడ ఫాంహౌజ్‌లో ఉంటే, రాజకీయంగా ప్రకంపనలు ఉండేవని బీఆర్ఎస్ నేతలు విశ్లేషిస్తున్నారు. ఏదేమైనా.. జస్ట్ మిస్సా? లేదంటే మిస్ ఫైరా? అనే అంశంపై ఇరు వర్గాలు బేరీజు వేసుకుంటున్నాయని చెప్పవచ్చు.

ఫుల్ బిజినెస్

రాబోయే రెండు నెలలు తెలంగాణలో పెళ్లిళ్లు

దీపావళి పండుగ ముగియగానే పెళ్లిళ్ల సీజన్ ప్రారంభంకానుంది. ఇందుకు వివాహ వేదికలు సిద్ధమవుతున్నాయి. మూడు నెలలుగా మూడాల కారణంగా శుభాకార్యాలు జరగలేదు. ఇక ఇప్పటి నుంచి పెళ్లి బ్యాండ్ బాజాలు మొదలవుతాయి. రెండు నెలల పాటు మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. దీంతో నిర్వాహకులు ఇప్పటి నుంచే పెళ్లి పనులు మొదలు పెడుతున్నారు. మంచి ముహూర్తం నిర్ణయించుకునేందుకు పురోహితులను ఆశ్రయిస్తున్నారు. రెండు నెలల పాటు వాయిద్యాలు, మండపాలు, క్యాటరింగ్ నిర్వాహకులకు చేతి నిండా పనులు ఉండనున్నాయి. మరోవైపు అడ్వాన్సులు చెల్లించి ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకుంటున్నారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో సుమారు వెయ్యికి పైగా ఫంక్షన్ హాళ్లు ఉండగా వసతులను బట్టి ఒక్క రోజు అద్దె రూ.70వేల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేస్తారు. పెళ్లిళ్ల సీజన్ మొదలు కావడంతో వాటి ధరలు ఒక్కసారిగా పెంచేశారు. దీపావళి కావడంతో వస్త్ర, బంగారు దుకాణాలు కొనుగోళ్లతో సందడిగా మారింది. ఇదే ఒరవడి రెండు నెలల పాటు ఉండనుంది. నాలుగు జిల్లాల్లోని సిద్దిపేట, గజ్వేల్, మెదక్, సంగారెడ్డి, జహీరాబాద్, వికారాబాద్, తాండూరుల్లోని దుకాణాల్లో రద్దీ పెరగనుంది. దీనికి తోడు ఇక్కడి నుంచి మరికొందరు హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేయనున్నారు.

నవంబర్, డిసెంబర్ నెలల్లో 21రోజుల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. ఆయా రోజుల్లో నాలుగు జిల్లాల్లో 20 వేలకు పైగా వేలల్లో పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా.

నవంబరులో - 3, 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17

డిసెంబర్‌లో - 5, 6, 7, 8, 9, 10, 13, 14, 15, 18, 26

13మంది ఐఏఎస్‌ల బదిలీ

తెలంగాణలో మరోసారి భారీగా ఐఏఎస్ అధికారులు బదిలీలు జరిగాయి. 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో.. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా హనుమంతరావు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా నారాయణ రెడ్డి, నల్గొండ కలెక్టర్‌గా త్రిపాఠిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మందా మకరందు, పర్యాటక శాఖ సంచాలకులుగా జెడ్ కె.హనుమంతులును నియమించగా.. దేవాదాయ శాఖ సంచాలకులుగా హనుమంతులుకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

అయితే.. మరో డేరింగ్ లేడీ ఆఫీసర్ అయిన టీకే శ్రీదేవికి పురపాలక శాఖ సంచాలకులుగా కీలక బాధ్యతలు అప్పజెప్పింది రేవంత్ రెడ్డి సర్కార్. గతంలో బీఆర్ఎస్ హయాంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన టీకే శ్రీదేవి.. 2023లో కేంద్ర ఎన్నికల సంఘం వేటు వేయటంపై సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తూ.. చర్చనీయాంశంగా మారారు. కాగా.. ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్.. కీలక శాఖ అయిన పురపాలన శాఖ బాధ్యతలు అప్పగించటం గమనార్హం.

మరోవైపు.. విపత్తు నిర్వహణ శాఖ సంయుక్త కార్యదర్శి హరీశ్‌కు ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. ఇక.. డెయిరీ కార్పొరేషన్ ఎండీగా కె.చంద్రశేఖర్ రెడ్డి, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.దిలీప్ కుమార్, ఆర్ అండ్ ఆర్, భూసేకరణ కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో డిప్యూటీ కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఏకంగా.. 47 మంది డిప్యూటీ, 23 మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను

రేవంత్ రెడ్డి సర్కార్ బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల అదనపు కలెక్టర్లు, 4 జిల్లాల డీఆర్వోలు స్థానచలనం అయ్యారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా.. ఆ శాఖలో 70 మంది అధికారులను ఒకేసారి బదిలీ చేయటం సర్వత్రా చర్చనీయాశంగా మారింది. రెవెన్యూ సంఘాల పదోన్నతులు, బదిలీల గురించి అధికారులు ఇప్పటికే మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖలో ఒకేసారి భారీగా బదిలీలు చేపట్టినట్టు తెలుస్తోంది. అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, భూసేకరణ అధికారులు, సివిల్ సప్లయిస్ శాఖల్లో అధికారులు అయ్యారు. ఈ మేరకు అక్టోబర్ 28న రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఆదేశాలు జారీ చేశారు.

రెచ్చిపోయిన ఉగ్రమూకలు

- అఖ్నూర్ సెక్టార్‌లో సైనిక వాహనంపై కాల్పులు
- సైన్యం అప్రమత్తం కావడంతో పారిపోయిన ఉగ్రవాదులు
- ముష్కరుల కోసం గాలింపు చేపట్టిన భద్రతా బలగాలు

జమ్మూ కశ్మీర్‌లో మరోసారి ఉగ్రవాదులు దాడులకు తెగబడ్డారు. సైనిక వాహనమే లక్ష్యంగా కాల్పులు జరిపారు. అఖ్నూర్ సమీపంలో సైనిక వాహనంపై పలు రౌండ్ల పాటు కాల్పులు జరపడంతో సైన్యం అప్రమత్తమయ్యింది. ఘటన గురించి సమాచారం అందుకున్న భద్రతా బలగాలు అక్కడకు చేరుకుని తనిఖీలు చేపట్టాయి. సైన్యం రాకతో ఉగ్రవాదులు అక్కడ నుంచి పరారైనట్టు తెలుస్తోంది. చుట్టుపక్కల ముష్కరుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

అఖ్నూర్ ఉగ్రదాడిపై ఆర్మీకి చెందిన వెట్ నెట్ కార్ప్స్ ఓ ప్రకటన విడుదల చేసింది. 'అఖ్నూరు సుందర్‌బని సెక్టార్‌లోని అసన్ సమీపంలో సైనిక కాన్వాయ్‌పై సోమవారం ఉదయం ఉగ్రవాదులు కాల్పులు జరిపారు.. ఈ దాడిని సమర్థంగా తిప్పికొట్టిన సైన్యం ఎదురుకాల్పులు జరిపింది.. ఘటనలో సైనికులు ఎవరూ గాయపడలేదు.. ఆ ప్రాంతంలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాల ఆపరేషన్ కొనసాగుతోంది.. చుట్టుపక్కల ముమ్మరంగా గాలిస్తున్నారు ' అని ప్రకటనలో పేర్కొంది.

కాగా, ఈ ఘటన గురించి పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. ఇటీవల ఉగ్రవాదుల వరుస దాడులు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే ఉగ్రవాదుల దాడుల్లో ఇద్దరు సైనికులు సహా 11 మంది ప్రాణాలు కోల్పోయారు.

బారాముల్లా జిల్లాలో గత గురువారం రాత్రి ఆర్మీ వాహనంపై ఉగ్రవాదులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు, ఇద్దరు పౌరులు సహా మొత్తం నలుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. దీనికి మూడు రోజుల ముందు సోన్ మార్గ్ సొరంగం వద్ద కార్మికుల క్యాంప్‌లోకి చొరబడి కాల్పులు జరిపారు . ఈ ఘటనలో ఓ డాక్టరు, ఆరుగురు కార్మికులు సహా ఏడుగురు చనిపోయారు.

ఇటీవల నెలల్లో పౌరులపై జరిగిన అత్యంత పాశవిక ఉగ్రదాడి ఇదే. ఇదిలా ఉండగా, పదేళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు జరిగి.. ఎన్సీపీ- కాంగ్రెస్ కూటమి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయిన కొద్ది రోజుల్లోనే వరుసగా ఉగ్రదాడులు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఘటనలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నగరంలో ఆంక్షలు

బెటాలియన్ పోలీసుల కుటుంబాలు రోడ్డెక్కాయి..

ఇట్లా వరుసగా జరుగుతున్న ఆందోళలతో ఉద్రిక్తతలు తలెత్తాయి. ప్రతిపక్షం ఆందోళనకారులకు బాసటగా నిలిచంది. దీంతో విచ్ఛిన్నకర శక్తులు విధ్వంస రచనకు ప్లాన్ చేశాయని ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి సిక్రెట్ నివేదిక అందజేశాయి. హైదరాబాద్లో చెలరేగే ఘర్షణలకు బారికేడ్ వేయక తప్పలేదు. పోలీసుల ఆందోళనలకు అణచివేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 311ను ప్రయోగించగా.. ఇప్పుడు సెక్షన్ 163తో ఆంక్షలు విధించి, అప్రకటిత కర్ఫ్యూ అమలు చేస్తోంది. ఆందోళనలపై ఉక్కుపాదం మోపటమే ప్రధాన ధ్యేయంగా సర్కారు సరికొత్త వ్యూహంతో బీఎన్ఎస్ (భారత న్యాయ సంహిత) సెక్షన్ 163 అమలుకు సిద్ధపడింది. ఇంత అకస్మాత్తుగా ప్రభుత్వం ఈ నిర్ణయాలను తీసుకోవటానికి నేపథ్యం ఏమిటీ? భవిష్యత్తు ఫలితం ఏమిటీ? అనే అంశాలపై జనంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

పోలీసులే తిరగబడితే..

పరిపాలన వ్యవస్థలో.. పోలీసు వ్యవస్థ కీలకమైంది. సర్కారుకు నమ్మిన భుటుల్లాంటివారు పోలీసులే. మరి ఈ వ్యవస్థలో వేళ్లూనిన గులాంగిరీని వ్యతిరేకించటమే రాజద్రోహంగా పరిపాలన వ్యవస్థ భావించింది. వారిపై ఆర్టికల్ 311 ప్రయోగించి పది మంది ఉద్యోగాలను ఊడగొట్టింది. 29 మందిని విధులకు దూరంగా పెట్టింది. ఇక్కడే పోలీసు వర్గాల్లో అసంతృప్తి రగిలింది. ఈ స్థితిలోనే రాష్ట్రమంతా ఒకే పోలీస్ విధానం అమలు చేయాలని టీజీఎస్పీ కానిస్టేబుళ్లు సెక్రటేరియట్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు సెక్రటేరియట్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. సచివాలయం చుట్టూ భారీగా పోలీసులను మోహరించారు. పరిపాలన సౌధం చుట్టూ 163 సెక్షన్ విధించారు. సెక్రటేరియట్ పార్కింగ్ గ్రౌండ్‌లో సుమారు 200 మంది సిబ్బందిని మోహరించారు.

ధర్నా చౌక్ వద్ద పోలీసుల భద్రత..

ధర్నా చౌక్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద పోలీసు వాహనాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. కాగా, వీడియోలు తీయడానికి మీడియాకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు నగరంలో ఆందోళన నేపథ్యంలో పోలీసులు నెలరోజుల పాటు ఆంక్షలు విధించారు. హైదరాబాద్ నగరంలో అశాంతిని సృష్టించడానికి పలు సంస్థలు, పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్వసనీయ సమాచారం అందిందని, ఈ నేపథ్యంలో ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నుంచి నవంబర్ 28 వరకు సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలపై నిషేధం విధించారు. అయిదుగురికి మించి గుమికూడితే చర్యలు తీసుకుంటారు. బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలులోకి వచ్చింది.

కర్ఫ్యూల్లేవ్.. మత ఘర్షణల్లేవ్..

హైదరాబాద్ పేరు చెబితే చాలు ఏ క్షణంలో ఎక్కడ ఘర్షణ జరుగుతుందో? ఎప్పుడు పోలీసులు కర్ఫ్యూ ఖడ్గం ఝుళిపిస్తారో? ఊహించటం కష్టం. కానీ, ఆ కాలం కరిగిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మత ఘర్షణలు లేవు. కత్తిపోట్లు లేవు. ఒక రకంగా రౌడీల దందాకు తెరపడింది. కర్ఫ్యూ ఊసు లేదు. పదేళ్లుగా దొమ్మీలు లేవు. ఉంటే.. అరకొర కిడ్నాపులు, హత్యలు.. ఎన్‌కౌంటర్ల వంటి వాటిని పోలీసులు సమర్థంగానే ఎదుర్కొన్నారు.

కానీ, తెలంగాణలో కాంగ్రెస్ శకం మళ్లీ పునర్జీవనం పోసున్న ఈ 10 నెలల కాలంలోనే.. ప్రభుత్వంపై ప్రతిపక్షం విరుచుకుపడటానికి కారణాలు ఏంటీ? సీఎం రేవంత్ తన సరికొత్త వ్యూహాలతో సామాన్య జనం మదిని కొల్లగొడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ శిబిరంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. తీసుకునే ప్రతినిర్ణయంపై జనంలో ఎక్కడ అసంతృప్తి జాడ కనిపించలేదు. కేవలం రెండు నెలల నుంచే సర్కారు పోకడపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ బ్యూరోక్రాట్లకు రేవంత్ రెడ్డి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. సొంత పార్టీ ప్రాబల్యం కూడా పైకి కనిపించటం లేదు. సీఎం మాటే శిరోధార్యం అనే రీతిలో అనేక నిర్ణయాలు వెలుగులోకి వచ్చాయి. కానీ, పథకాల అమలులో సర్కారు తప్పులో కాలు వేసినట్టు జనంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

మూసీ మసి, జీవో 29, కానిస్టేబుళ్ల గోస..

మూసీ నది ప్రక్షాళనలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై పేదల్లో ఎలాంటి వ్యతిరేకత లేదు. కానీ మధ్యతరగతిలోనే తీవ్ర అసంతృప్తి రాజుకుంది. అప్పులు చేసి కట్టుకున్న ఇళ్లు కళ్లముందే కూలిపోతుంటే తట్టుకోలే కపోతున్నారు. వీరిని సముదాయించటంలో ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణ ఉంది. అందుకే ప్రతిపక్షాలకు ఓ ఆయుధం దొరికింది. జనాన్ని రెచ్చగొట్టే అవకాశం లభించింది. మూసీ సుందరీకరణకు ఓకే.. అంటూనే ఇళ్లను కూల్చొద్దు అంటూ వారి మదిని ఆకట్టుకుంటోంది. ఈ మూసీ వ్యవహారమే ప్రభుత్వానికి వైరల్ పీవర్‌గా మారింది.

ఇక గ్రూప్ వన్ ఉద్యోగాల భర్తీ వ్యవహారంలో రెండు రకాల జీవోలు మంటలు రగిల్చాయి. లక్షల మంది నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. తెలంగాణ స్పెషల్ పోలీసుల ఆందోళనపై జనంలో సానుభూతి పెరిగింది. టీజీఎస్పీ కానిస్టేబుళ్ల గులాంగిరీపై తీవ్ర చర్చ జరిగింది. పోలీసు శాఖలో ఇంత బానిసత్వమా? అనే ప్రశ్నలు రేగాయి. ఆఖరికి ఇంటి ఇల్లాళ్లు, బిడ్డలు రోడ్డెక్కితే.. అసలు సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచించలేదనే అపవాదును ప్రభుత్వం మూటగట్టుకుంది. ఆర్టికల్ 311 ప్రయోగించి రాజద్రోహం నిందతో 10 మంది ఉద్యోగాలను తొలగించటాన్ని జనం జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ సమస్యలన్నింటిలోనూ ప్రజల హక్కుల హననం చేస్తోందనే నింద ప్రభుత్వానికి తప్పటం లేదు.

గుమిగూడితే అరెస్టులే..

బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలు కూడా ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే ప్రమాదం ఉం

సంచలన వార్తలకు నేడు

వణికిస్తున్న యుద్ధాలు

ఒకటి తర్వాత ఒకటిగా మొదలవుతున్న యుద్ధాలు ప్రపంచాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గత ఏడాది అంటే 2023 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌ను మట్టుపెట్టాలని రష్యా భీకర దాడికి దిగింది. ఉక్రెయిన్ మొదట చిగురుటాకులా వణికిపోయింది. తర్వాత అమెరికా అండగా నిలబడడంతో ధైర్యాన్ని కూడగట్టుకొంది. ఆత్మవిశ్వాసంతో రష్యాపై ప్రతీకార దాడులకు దిగింది. రెండు దేశాలమధ్య యుద్ధం ప్రారంభమై ఏడాదిన్నర అయినా రష్యా వెనక్కి తగ్గలేదు. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా అని ప్రపంచ ప్రజలు ఆందోళన చెందారు. అయితే ఈమధ్య మన ప్రధాని నరేంద్ర మోడీ చర్చలు జరిపిన తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్ వైఖరిలో కొంత మార్పు కనిపిస్తోంది.

ఒకవైపు ఈ యుద్ధంతోనే ప్రపంచం తల్లడిల్లుతుంటే మరోవైపు పులిమీద పుట్రలా ఇరాన్ – ఇజ్రాయెల్ – లెబనాన్ యుద్ధం ముంచుకొచ్చింది. అక్టోబర్ ప్రారంభంలో ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్స్‌తో ఇజ్రాయెల్‌పై ఒక రోజు రాత్రంతా భీకర పోరు సాగించింది. ఇజ్రాయెల్ ఏమీ వెనక్కు తగ్గలేదు. ఇరాన్‌పై దాడులకు తెగబడింది. రెండు దేశాల పరస్పర దాడులతో మధ్యప్రాచ్యంలో (మిడిల్ ఈస్ట్) ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ యుద్ధంలో కూడా అమెరికా ప్రమేయం ఉంది. అమెరికా ఇజ్రాయెల్‌కు వెన్నుదన్నుగా నిలిచింది. దాంతో ఇజ్రాయెల్ నూతనోత్తేజంతో ముందుకురికింది. ఇరాన్‌లోని పాలస్తీనా సంస్థ 'హమాస్' అంటే ఇజ్రాయెల్‌కు మొదటి నుంచీ వైరమే. హమాస్‌ను ఎలాగైనా మట్టికరిపించాలని పట్టుబట్టి దాని అధినేతనే మట్టుబెట్టింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి హఠాత్తుగా జరిగింది కాదు. అంతకు ముందు కొన్ని రోజులుగా చర్చలు జరిగాయి. ఒకవేళ ఇరాన్‌పై దాడికి దిగితే ఎలాంటి పరిణామాల్ని ఎదుర్కోవలసి వస్తుందో అనే సందేహం కూడా కలిగింది. కానీ అమీ తుమీ తేల్చుకోవాలనే ఇజ్రాయెల్ ఎదురు దాడికి దిగింది. ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూను తక్కువగా అంచనా వేయలేం. యుద్ధ వ్యూహాలలో నిపుణుడు. ప్రతీకార దాడులకు దిగిన ఇజ్రాయెల్ ఇరాన్ పైన, లెబనాన్ పైన కూడా మూడుసార్లు అతి భయంకర దాడులకు పాల్పడింది. ఇరాన్ ను మట్టి కరిపించాలనేదే నెతన్యాహూ లక్ష్యం. దాడులకు కొన్ని రోజుల ముందు నెతన్యాహూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఇరాన్ ఆయిల్ ఫీల్డ్స్‌పైన, అణు స్థావరాలపైనా దాడులు చేయవద్దని అమెరికా ఇజ్రాయెల్ కు సలహా ఇచ్చింది.

అమెరికా ఇలా సలహా ఇవ్వడానికి కారణం ఉంది. నవంబర్‌లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగబోతున్నాయి. యుద్ధంలో ఒకవేళ ఇరాన్ చమురు క్షేత్రాలు నాశనమైతే ఆ ప్రభావం ప్రపంచంపైన పడుతుంది. అధ్యక్ష ఎన్నికలు ముంగిట్లో ఉన్న దశలో ప్రపంచదేశాల నుంచి తీవ్ర విమర్శలు, వ్యతిరేకత రావచ్చు. ఇక్కడ గమనించాల్సిన రెండు అంశాలున్నాయి. సరిగ్గా సంవత్సరం కిందట ఇదే అక్టోబర్ లో ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరిగింది. ఇక రెండో అంశం పరిశీలిస్తే... ఉక్రెయన్‌పై రష్యా చేస్తున్న సుదీర్ఘ యుద్ధంలో అమెరికా ఉక్రెయిన్‌కు చేయూత నిచ్చింది. రష్యాపై ఉన్న వైరమే ఇందుకు కారణం. ఇక ఇరాన్ – ఇజ్రాయెల్ యుద్ధం విషయానికి వస్తే మొదటి నుంచీ అమెరికా ఇజ్రాయెల్ వైపే ఉందని ప్రపంచ రాజకీయాల్ని గమనిస్తున్న వారికి తెలుసు. బాలిస్టిక్ క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ జరిపిన దాడి అమెరికాకు ఒక సాకుగా దొరికింది. ఈ క్రమంలోనే ఇజ్రాయిల్ 100 కు పైబా జెట్ ఫైటర్లతో టెహరాన్‌లోని మిలటరీ స్థావరాలపై మెరుపుదాడి చేసి ప్రతీకారం తీర్చుకుంది. అయితే దేశాల మధ్య యుద్ధాల వల్ల నాయకులకు ఏం కాదు. దెబ్బతినేది సామాన్యులే. అనేక రంగాలు నష్టానికి గురి కావడం వల్ల ఆ ప్రభావం తప్పకుండా ఉంటుంది. ఈ యుద్ధాల్ని ఆపేందుకు ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పటాకుల సందడి

అసలు దీపావళి సందడంతా బాణాసంచా కాల్చడంలోనే ఉంది. ఇప్పుడంటే అంత హడావిడి కనబడడం లేదు కానీ ఒకప్పుడు కొన్నేళ్ల కిందటివరకూ దీపావళి అందరిలో దీపాల పండగ సంబరం వెల్లివిరిసేది. దీపావళికి రెండు మూడు నెలల ముందు నుంచే టపాకాయలు కాల్చడం మొదలయ్యేది. పండగకు మిగతా పనుల సంగతి ఎలా ఉన్నా పిల్లలకు టపాకాయల చప్పుడే దీపావళి. అయితే ఏటికేడాది టపాకాయల రేట్లు పెరుగుతుండడంతో , కొనడం తగ్గి, సందడి కూడా తగ్గిపోయింది. చివరికి పరిస్థితి ఎలా మారిందంటే 'రేపు దీపావళి' అని చెబితే 'అలాగా' అని ఆశ్చర్యపోయే రోజులు వచ్చాయి.

సత్యభామ నరకాసురుడిని వధించిన శుభ సందర్భంలో ఆ సంతోషాన్ని చాటుకోడానికి దీపావళి పండగ జరుపుకుంటున్నామని అందరికీ తెలుసు. ఆ పండగకు కాల్చే టపాకాయలు ఎలా వచ్చాయో బాణసంచా తయారు చేయాలన్న ఆలోచన ఎలా వచ్చిందో తెలుసుకుందాం. టపాకాయల తయారీ ఆలోచనకు 'ఉప్పు' కారణమని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఉప్పు నిప్పు మీద పడితే చిటపటలాడుతుంది. పెట్లుప్పును (పొటాషియం నైట్రేట్) ఉప్పు దొరకని ప్రాంతాల్లో వాడుతుంటారు. ఇది మంటల్లో కానీ, కాలుతున్న నిప్పుల్లో కానీ పడితే పెద్దగా చప్పుడు చేస్తూ పేలుతుంది. ఈ పెట్లుప్పుకు బొగ్గుపొడి, గంధకం కూడా తోడయితే ఇంక చెప్పక్కర్లేదు. ఆ రోజుల్లో యుద్ధాల్లో తుపాకీ మందును తయారు చేయడానికి పెట్లుప్పు, బొగ్గుపొడి, గంధక మిశ్రమాన్ని ఉపయోగించేవారు. ఇలా తుపాకీ మందు తయారు చేయడం మొట్టమొదట 14 వ శతాబ్దంలో ప్రారంభమైంది. కానీ అప్పట్లో టపాసులు తయారు చేయలేదు.

16వ శతాబ్దంలో...

16వ శతాబ్దం ప్రారంభంలో ఇటలీ శాస్త్రవేత్తలు మొట్టమొదట టపాకాయలు తయారు చేశారు. ఆ తర్వాత ఇనుప రజను, నైట్రేట్, క్లోరేట్, ఫెర్రి క్లోరేట్ లను కూడా కలిపి రకరకాల టపాకాయలు చేయడం మొదలుపెట్టారు. చైనా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు బాణాసంచాను ఒక పరిశ్రమగా మార్చాయి. రసాయనిక పదార్థాలు (కెమికల్స్) దొరకక పోవడం వల్ల 1960 ల వరకూ మనం టపాకాయలను దిగుమతి చేసుకునే వాళ్లం. ఇప్పుడు కాగితం, ముడిపదార్థాలు ఇక్కడే లభిస్తుండడంతో బాణాసంచా మన దేశంలోనే తయారవుతోంది. తమిళనాడులోని శివకాశి పరిశ్రమకు పెట్టింది పేరు.

ఒకప్పుడు పల్లెటూళ్లలో దీపావళినాడు చాంతాడుకు నూనె వస్త్రం కట్టి, దానిని అంటించి గిరగిరా తిప్పు తూ పిల్లలు వీధుల్లో తిరిగేవారు. తర్వాత టపాకాయలు కాల్చేవారు. ఉల్లిపాయలు, నేల టపాకాయలు, తాటాకు టపాకాయలు, రోలు రోకలితో పేల్చే టపాకాయలు, మతాబులు, కాకరపువ్వొత్తులు , కుండ చిచ్చుబుడ్లు, జువ్వలు ఆ రోజుల్లో ఉండేవి. తర్వాత తుపాకీ బిళ్లలు, రోల్ కాప్స్ వచ్చాయి. అప్పట్లో తుపాకీ బిళ్లల్ని తుపాకీతోనే కాకుండా, నట్టు అనే పరికరంలో కూడా బిగించి నేల మీద కొట్టేవారు. ఇప్పుడు రాకెట్లు, బెట్లు, వాల్కనో బాంబులు, రైల్వే సిగ్నల్ లైట్స్, ఫ్లవర్ క్రాకర్స్ వంటి రకరకాల కొత్త కొత్త బాణాసంచా తయారవుతోంది.

-వీ. మధుసూదనరావు

సెట్విన్‌కు అండగా ఉంటాం

-మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

చార్మినార్, నేడున్యూస్: నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టమైన హామీ ఇచ్చారు. సెట్విన్ సంస్థను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి పొన్నం సందర్శించారు. ఈ సందర్భంగా అధునాతన వసతులతో రూపొందించిన సంస్థ చైర్మన్ కార్యాలయాన్ని చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వాటి పురోగతి తదితర అంశాలను చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్‌రావుతో కలిసి సమీక్షించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సంస్థ నిర్వహిస్తున్న శిక్షణ, ట్రాన్స్‌పోర్ట్, ట్రేడింగ్ ద్వారా ఆదాయాన్ని సమకూర్చే విధంగా తనవంతు సహకారం తప్ప ఉంటుందన్నారు. జంట నగరాల్లోని నిరుద్యోగులకు శిక్షణ అందించి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 1978సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ఒక మంచి ఆశయంతో సెట్విన్ సంస్థను స్థాపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ కేవలం జంట నగరాలకే పరిమితం కాకుండా తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాలకు విస్తరింపచేసే చర్యలు చేపడుతున్నామని వివరించారు. త్వరలోనే జహీరాబాద్, జెడ్చెర్ల, హుస్నాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాలలో సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు.

రాబోయే రెండు సంవత్సరాలలో 50 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసే లక్ష్యంగా ముందుకు సాగుతామని, ప్రతి ఏటా కనీ సం 25 వేల మంది నిరుద్యోగ యువతీ యువకు లకు శిక్షణ అందించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో మేము పని చేస్తున్నాము. కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ సురేష్‌బాబు, మేనేజర్ అబ్దుల్ మొయిజ్, సెట్విన్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె నిద్రలో పోలీస్ డిపార్ట్మెంట్

* నేరాల నియంత్రణకు ప్రజల సహకరించాలి
* నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు: సర్కిల్ ఇన్స్పెక్టర్

ఉలవపాడు, నేడు న్యూస్: జిల్లా ఎస్పీ ఉత్తర్వులు మేరకు పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు సిఐ ఉలవపాడు మండలం, కరేడు గ్రామంలో సోమవారం పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సదరు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గ్రామస్తులకు పెద్దలకు, రోడ్డు యాక్సిడెంట్ గురించి, సైబర్ నేరం గురించి, దొంగతనాల గురించి, మహిళలపై, పిల్లలపై జరుగు నేరముల గురించి అవగాహన కల్పించారు. అంతేకాక కొత్తగా ఏర్పడిన చట్టాల గురించి గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సిఐ తో పాటు ఉలవపాడు ఎస్ఐ, స్టేషన్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కేడీహెచ్‌కే కో-ఆపరేటివ్ ఎన్నికలు

చందానగర్, నేడున్యూస్: డివిజన్ పరిధిలోని అర్జున్‌రెడ్డి కాలనీలోని ఖాన్స్ దేవి హోమ్స్ ఖ్యాతి అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటనెన్స్ మ్యూచ్‌వల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం పదిమంది పోటిలో నిలిచారు. వారిలో బురిది తిరుపతిరావ్, కె.ఈశ్వర రావు, వెంకటసాయి క్రిష్ణ, ఎన్.వేణుగోపాల్, మధుకిరణ్‌రెడ్డి, వెంకట సురేష్‌కుమార్, సూర్యతేజ, బాబ శ్రవణ్‌కిషోర్, శ్రీనివాసులు గెలుపొందారు. ఈ సంధర్భంగా ఫ్లాట్ ఓనర్స్ గెలుపొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా సాయిలు, గణపతిరావు, కుమారస్వామిలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

సీపీని కలిసిన ప్రతినిధులు

నాంపల్లి, నేడున్యూస్: మర్యాదపూర్వకంగా ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్‌ను కలవడం జరిగింది. సీపీని కలిసిన వారిలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కే.నిరంజన్, కార్యదర్శి బీ.సురేందర్‌రెడ్డి, కోశాధికారి డా.బీ.ప్రభాశంకర్, సభ్యులు ధీరజ్‌కుమార్, జైశ్వాల్ తదితరులు ఉన్నారు.

స్నేహబంధం తోడు

ఖమ్మం టౌన్, నేడున్యూస్: ఎవరికి ఆపద వచ్చినా వారు మా కుటుంబ సభ్యులే అంటూ ఖమ్మం నగరానికి చెందిన స్నేహబంధం ఫౌండేషన్ ఆదుకునేందుకు ముందుకు వస్తుంది. వరద బాధితులకు వారి కుటుంబాలకు గ్యాస్ పొయ్యి, బెడ్, ఇంట్లో సామాగ్రి, నిత్యావసర సరుకులు, బిస్కెట్లు, పులిహోర, సాంబార్ రైస్, పెరుగన్నం, బట్టలు, దుప్పట్లు అందిస్తున్నారు.

ఖమ్మంలో భారీగా వచ్చిన వరద ముప్పు నుంచి ఇంకా చాలా కుటుంబాలు కోలుకొకపోవడంతో స్నే హబంధం ఫౌండేషన్ వారికి ధైర్యం చెప్తూ సహాయ సహకారాలు అందిస్తూ తోడుగా నిలుస్తున్నారు. వారి సేవలకు ఖమ్మం వాసులు అభినందనల వర్షం కురిపిస్తున్నారు.

రింగ్ మాస్టర్లు?

- బల్దియా ఇంజనీరింగ్ విభాగంలో మాయ?
- లేని పోస్టులు క్రియేట్ చేస్తున్న వైనం?
- రెండు పోస్టులతో కొందరు అధికారుల ఎంజాయ్?
- ప్రమోషన్లు మాకే.. పాత పోస్టులు మాకే?
- అక్రమాలు తగ్గుతున్నాయా? పెరుగుతున్నాయా?
- బల్దియాపై కొరవడిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షణ?

గ్రేటర్ హైదరాబాద్ బ్యూరో, నేడునూస్: షాన్ ఏ షహర్ గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో కొందరు అధికారులు ఆడింది ఆట పాడింది పాటగా మారింది పరిస్థితి. శాంక్షన్ లేని పోస్టుల్లో సైతం ప్రమోషన్ల పేరుతో హోదాలు సృష్టించుకుంటూ తీష్ట వేస్తున్నారు? అనే విమర్శలు వస్తున్నాయి. సీనియర్ల పేరుతో రెండు పోస్టులు ఎంజాయ్ చేస్తూ కిందిస్థాయి ఉద్యోగులను మాత్రం పట్టించుకోవడం లేదనే టాక్ వినిపిస్తోంది.

బల్దియాలో రెండు చీఫ్ ఇంజనీర్-సీఈ పోస్టులు ఉంటే నాలుగు పోస్టులు క్రియేట్ చేసుకుని ఇష్టం వచ్చినట్లుగా ప్రమోషన్లు పొందుతున్నారు. అసలు జిహెచ్ఎంసిలో ఒక సీఈకి మాత్రమే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అవకాశం ఉండేది. తర్వాత మరొక సీఈ పోస్టును క్రియేట్ చేసినా.. దీనికి ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో అనుమతి లేనట్లుగా తెలుస్తుంది. అయినా సీఈ మెయింటెనెన్స్, సీఈ ప్రాజెక్ట్స్, సీఈ హౌసింగ్, సీఈ లెక్స్, సీఈ ఎస్ఎన్‌డీపీ పేరుతో పోస్టులు క్రియేట్ చేసుకుని ఎవరి ఫైరవీలు వాళ్ళు చేసుకుంటూ ప్రమోషన్లు తెచ్చుకుంటున్నారు. వీటికి కూడా సీనియార్టీని పక్కనపెట్టి ఇష్టం వచ్చినట్లుగా ఫైరవీలు చేసుకున్న వాళ్లేదే సీటు అన్నట్లుగా సాగుతుంది బల్దియాలో ఇంజనీరింగ్ వ్యవహారం.

సీఈతో పాటు ఎస్ఈ పోస్టు?

ఇక సీఈ పోస్టుల్లో తిష్ట వేసిన కొద్దిమంది అధికారులు గతంలో ఉన్న సూపరిండెంట్ ఇంజనీర్ హోదాను వదులుకోవడానికి ఏమాత్రం ఇష్టపడడం లేదు. ఆ కడ నేనే ఉంటా ఇక్కడ నేనే ఉంటా అన్నట్లుగా సాగుతుంది వారి వ్యవహారం. రెండు ప్రాంతాల్లో ఏది వదులుకోవలసిన అవసరం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. తమకు పైపోస్టులపై ఇష్టం ఉన్నట్లే కింద సాయి ఉద్యోగులకు కూడా పై పోస్టులను నిర్వహించాలన్న ఆశ, కోరిక ఉంటుందన్న విషయాన్ని ఈ చీఫ్ ఇంజనీర్లు మర్చిపోయినట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాము మాత్రం పై పోస్టు కొట్టేసి అప్పటికే ఉన్న పోస్టులలో అలాగే కొనసాగుతూ కిందివారిని పైకి రాకుండా చేయడంలో వీరు చక్రం తిప్పుతున్నారు.

రిటైర్ అయ్యే సూపరింటెండెంట్?

ఈ నెలలో రిటైర్డ్ అయ్యే ఒక సూపరింటెండెంట్ ఇంజనీర్ తాను చీఫ్ ఇంజనీర్ హోదాలో రిటైర్ అవుతానంటూ తనకంటే ముందున్న పలువురు అధికారుల కాళ్ళ వెళ్ళబడి ఆ సీట్లో కూర్చున్న తర్వాత తనకు ఇప్పుడు ఎక్స్‌టెన్షన్ కావాలంటూ పైరవీలు ప్రారంభించారు. సీనియార్టీ ప్రకారం సదరు అధికారికి అసలు ఆ హోదానే దక్కదు. సీఈ కుర్చీలో కూర్చున్న తర్వాత జోన్‌లో కూడా సూపరింటెండెంట్ ఇంజనీర్ సీటును వదలకపోవడం బల్దియా వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. జిహెచ్ఎంసిలో సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ పోస్టులు మొత్తం 16. ఇందులో ఒకటి జిహెచ్ఎంసి బార్స్ ఎంప్లాయిస్‌కు కేటాయించగా మిగతావి పబ్లిక్ హెల్త్ నుంచి వచ్చిన వాళ్లు తీసుకుంటున్నారు. అయితే పై అధికారులకు నచ్చినపుడు ఆ సంఖ్యను 17.. 18కి కూడా పెంచిన సందర్భాలు ఉన్నాయి. ఎస్ఎన్‌డిపిలోను ప్రాజెక్టులను ప్రభుత్వం నుండి పర్మిషన్ రాకముందే పోస్టులను కేటాయించి తమకు నచ్చిన రాజులకు రెండు మూడు జోన్లు కూడా కేటాయించిన సందర్భాలు బల్దియాఇంజనీరింగ్‌లోపరిస్థితినికళ్ళకు కడుతున్నాయి.

సీఎం శాఖ కావడంతో...?

మునిసిపల్ శాఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే నిర్వహిస్తుండడం వల్ల ఈ విధంగా ఎక్స్‌టెన్షన్ల పర్వం కొనసాగితే పబ్లిక్ నుండి కిందిస్థాయి ఉద్యోగుల నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం లేకపోలేదు. అయితే గత ప్రభుత్వం ఇచ్చిన ఎక్స్‌టెన్షన్లను పూర్తిస్థాయిలో రద్దు చేసిన ప్రభుత్వం కొత్త వారిని తీసుకోవాలంటే మాత్రం తమ అనుమతి తీసుకోవాలని నిబంధనలు పెట్టింది. గత ప్రభుత్వం చేసిన తప్పులపై చర్యలు తీసుకొని ఈ ప్రభుత్వం అక్రమంగా ఎక్స్‌టెన్షన్‌లను ఇవ్వడాన్ని తప్పు పట్టింది.. కానీ కొంత మంది అధికారులు తమకున్న పలుకుబడిని ఉపయోగించుకొని తమ పబ్బం గడుపుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అన్ని రూల్ ప్రకారం చేస్తామని చెప్పుకునే గత ఈఎన్‌సీ రూల్ ప్రకారం సీనియార్టీ లిస్టులో ఉన్న వ్యక్తిని కాదని... జూనియర్‌కి సీఈ ఎస్ఎన్‌డిపీ పోస్టును కేటాయించారు. ఇదేంటని ఆ సీనియర్ ఆఫీసర్ ప్రశ్నిస్తే చేసిన తప్పును సరిదిద్దకుండా ఆయనకు మెయింటెనెన్స్ విభాగంలో సీఈగా బాధ్యతలు కట్టబెట్టాడు. ఇలా ఎవరికి నచ్చినట్టుగా వాళ్ళు పోస్టులను పనిచేసుకుంటూ కిందిస్థాయి అధికారులకు మాత్రం మొండి చేయిస్తున్నారు. ఈ విభాగంలో గతంలోనూ సీనియార్టీని పక్కనపెట్టి తనకు నచ్చిన వారిని సీఈ ప్రమోషన్లు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఏదేమైనా బల్దియా ఇంజనీరింగ్‌లో చోటుచేసుకుంటున్న రింగ్ విధానానికి అడ్డుకట్ట వేయాల్సి ఉన్నది.

అక్రమ నిర్మాణం

*** గ్రౌండ్ ప్లస్ నాలుగు అంతస్తుల నిర్మాణం *బల్దియా అధికారులకు అందిన ఫిర్యాదు**

గోషామహల్, నేడున్యూస్: అక్రమ నిర్మాణాలకు గోషామహల్ మార్కెట్ ప్రాంతాలు అడ్డాలుగా మారాయి. బేగంబజార్ పరిసర ప్రాంతాలలో గజం స్థలం రూ.6 లక్షల వరకు చేరుకోవడంతో స్థలాల అక్రమణ, అక్రమ నిర్మాణాల ఊపు కొనసాగుతోంది. గతంలో మాజీ మంత్రి ముఖేష్ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలు చోటుచేసుకోగా..

అదే సాంప్రదాయం ఇప్పుడు కూడా కొనసాగుతోందని స్థానికులు మండిపడుతున్నారు. వంద గజాల స్థలంలోనూ సెల్లార్లు నిర్మిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక బేగంబజార్, గౌలిగూడ, షాయినాయత్ గంజ్, ఫీల్‌ఖానా, బర్తన్‌బజార్, చత్రి తదితర ప్రాంతాలలో ఖాళీ స్థలం కనిపిస్తే ఒట్టు. ఈ క్రమంలోనే అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నారు.

నయాబస్తీలో నిర్మాణం

షాయినాయత్‌గంజ్‌లోని బీర్‌బన్‌బాగ్ నయాబస్తీలో గ్రౌండ్ ప్లస్ నాలుగు అంతస్థుల అక్రమ నిర్మాణం జరుగుతోంది. నిబంధనలు ఉల్లంఘించిన చేపట్టిన నిర్మాణం కావడంతో స్థానికులు బల్దియా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏడాదికి ఒకరు చొప్పున బల్దియా బాస్‌లు మారుతుండటం..

జోనల్ స్థాయిలో జెడ్‌సీలు అక్రమ నిర్మాణాలకు ఊతం ఇస్తుండటం తో డీసీలు, టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అవినీతి అధికారులు రాజకీయ అండతో అందినంత దండుకుంటూ అక్రమ నిర్మాణాలను కొనసాగించేలా సహకరిస్తున్నారు. ఏదేమైనా బల్దియా బాస్ ఇలంబర్తి బేగంబజార్ ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశానవాటికకు విరాళం

-బీవీఎల్ ఇన్‌ఫ్రా ప్రాపర్టీస్ ఎండీ వెంకట్‌రాజ్ దాతృత్వం

మల్కాజిగిరి, నేడున్యూస్: తోటి వారికి సహాయం చేయాలనే ఆలోచనతో బీవీఎల్ ఇన్‌ఫ్రా ప్రాపర్టీస్ ఎండీ వెంకట్‌రాజ్ దాతృత్వం చాటుచేసుకున్నారు. ఇందులో భాగంగానే మౌలాలి గాంధీనగర్‌లోని శ్మశానవాటికను శుభ్రం చేసేందుకు తనవంతుగా ఆర్థిక సహాయం అందించారు. చెత్త, చెదారంతో ఉండే శ్మశానవాటికలో పనులు చేపట్టడంతో పరిసరాలు శుభ్రంగా కనిపిస్తున్నాయి. ఓవైపు అధికారులు మరోవైపు ప్రజా ప్రతినిధులు దృష్టి సాధించకపోవడం వల్లే శ్మశానవాటికలో పరిసరాలు దుర్భరంగా మారాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే శ్మశానం శుభ్రం చేసేందుకు సహకరించాలని కోరడంతో బీవీఎల్ ఇన్‌ఫ్రా ప్రాపర్టీస్ ఎండీ వెంకట్‌రాజ్ రూ.పది వేల ఆర్థిక సహకారం అందించారు. దీంతో శ్మశానవాటికలో పరిసరాలను శుభ్రం చేసే పనులు చేపట్టారు. గొప్ప మనసుతో ముందుకు వచ్చి అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించినందుకు వెంకట్ రాజుకు మౌలాలి బస్తీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణికి 71 ఫిర్యాదులు

హైదరాబాద్,నేడున్యూస్: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను డిఆర్ఓతో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (71) ఫిర్యాదులు అందాయన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

చంపాపేట్,నేడున్యూస్: హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సి వి ఆనంద్ సూచనల మేరకు ట్రాఫిక్ కమిషనర్ విశ్వప్రసాద్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ వన్ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు పర్యవేక్షణలో నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి శంకర్ రాజు పేర్కొన్నారు. పోలీస్ సంస్కరణ వారోత్సవాలలో భాగంగా మహంకాళీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గవర్నమెంట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసిపి జి .శంకర్ రాజు మహంకాళీ ట్రాఫిక్ ఎస్ఐ పి మహేష్, ఏఎస్ఐ శివ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం,నేడున్యూస్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధి 15వ వార్డు పటేల్ గూడాలో 30 లక్షల రూపాయల నిధులతో ఇందిరా గాంధీ చౌరస్తా నుండి వీర హనుమాన్ పొదుపు సంఘం వరకు, 9వ వార్డు మమ్మరాజుగూడ 5 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, 11వ వార్డు బొంగులూరు దర్గా నుండి బద్దం ధనమ్మ ఇంటి వరకు 10 లక్షల రూపాయల సిసి రోడ్డు, 1వ వార్డ్ ఆదిభట్లలో 5 లక్షల రూపాయలతో సిసి రోడ్డు పనులను ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కామాండ్ల యాదగిరి, కౌన్సిలర్లు మర్రి అర్చన రామ్ రెడ్డి, కమిషనర్ బాలకృష్ణ, స్వరన్ కుమార్,స్థానిక నాయకులు, ప్రజలు, వివిధ కాలనీల పెద్దలు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

వనపర్తి క్రైమ్,నేడున్యూస్: సోమవారం రోజు వనపర్తి జిల్లా కేంద్రలోని జిల్లా పోలీసు కార్యలయం నుండి ప్రారంభమై బస్టాండ్ నుండి పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు ఉత్సాహంగా సాగిన సైకిల్ ర్యాలీ. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఈ రోజు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయం నుండి పాలిటెక్నిక్ కళాశాల మైదానం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది .ఇట్టి సైకిల్ ర్యాలీని జిల్లా ఎస్పీ జండా ఊపి ప్రారంభించడం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి అదనపు ఎస్పి రాందాస్ తేజవాత్, ఏ ఆర్ డి.ఎస్.పి, వీరారెడ్డి, వనపర్తి డి.ఎస్.పి, వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ, కృష్ణ, కొత్తకోట సిఐ, రాంబాబు,ఆత్మకూరు సిఐ, శివకుమార్, మరియు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నం,నేడున్యూస్: భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఇబ్రహింపట్నం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం లోని ప్రజాభవనం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మస్కు చరణ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 8,300 వేల కోట్ల దాకా ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ పెండింగ్లో ఉన్నాయన్నారు రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యార్థులు గత మూడు సంవత్సరాల నుండి పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల యజమాన్యాలు మేము కాలేజీలు నడపలేమని బంధు నిర్వహించి దీక్షలు చేపట్టారన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల శ్రీకాంత్, ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బోడ వంశీ, ఏర్పల తరంగ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విప్లవకుమార్ , అలాగే ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, మధు, సంపత్, సందీప్ విక్కీ, వినయ్, 1000 విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపం స్థలంలో...

క్రాకర్స్ షాప్ ఎలా?

-ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

మణికొండ జాగీర్, నేడున్యూస్: భక్తులు ఆరాధించే చోట వ్యాపారం నిర్వహించడం ఏమిటి? అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మణికొండ జాగీర్ మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపురి టౌన్‌షిప్‌లో చోటుచేసుకున్న వ్యవహారం అధికారుల నిర్లక్ష్యానికి ఉదాహరణగా నిలిచింది.

అల్కాపురి టౌన్‌షిప్ వినాయకుడు చాలా ఫేమస్. ఇటీవల లడ్డూ వేలం పాటలో రూ.20 లక్షలకు ఇక్కడి వినాయకుడి లడ్డూ సొంతం చేసుకున్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక అల్కాపురి టౌన్‌షిప్ రోడ్ నెం 13లోని వినాయక మండపం చౌరస్తాలో క్రాకర్స్ షాప్ పెట్టడంతో స్థానిక భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.

తాము ఎంతో ఇష్టంగా కొలిచే వినాయకుడి మండపం దగ్గర వ్యాపార లాభాపేక్షతో ఓ క్రాకర్స్ షాప్ పెట్టడం పట్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితమే ఎలాంటి అనుమతులు లేని క్రాకర్స్ షాప్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడాన్ని ప్రజలు గుర్తుచేస్తున్నారు. పార్కులో ఇలాంటి వ్యవహారం నిర్వహణపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం స్థానిక ప్రజలకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది.

ప్రసిద్ధి పొందిన అల్కాపురి టౌన్‌షిప్ వినాయక మండపం ప్లేస్ నుంచి క్రాకర్స్ షాప్ తొలగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దేవుడి కోసం కేటాయించిన స్థలాన్ని వ్యాపార నిర్వహణకు ఎలా ఉపయోగిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని మణికొండ జాగీర్ మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా... విచారణ జరుపుతున్నామని తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం,నేడున్యూస్: ఇబ్రాహీంపట్నం మండల పరిధిలోని రాయపోల్ గ్రామంలో సూర్యోదయ కాలనీ బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ మచ్చ మహేందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సూర్యోదయ కాలనీ వెళ్లే రోడ్డు మందగూడ కు వెళ్ళే దారిలోని వాగుపై బిడ్జ్ నిర్మాణం పనులు మధ్యలో వదిలేసినా కాంట్రాక్టర్ ఎన్నో సంవత్సరాల నిరీక్షణ ఈ బ్రిడ్జీ నిర్మాణం అని సూర్యోదయ కాలనీ మందగూడ వెళ్లే రోడ్డు ఈ బ్రిడ్జీ నిర్మాణం పనులు మధ్యలో ఆగిపోవడంతో రోజు రాకపోకలకు గ్రామస్తులు చాలా ఇబ్బంది అవుతుందన్నారు అని ఆయన తెలిపారు. ఆర్టిసి బస్సు రావడం లేదని ప్రతి రోజు విద్యార్థులు వివిధ పనులకు వెళ్లే వాళ్లు నడక దారిన వెళ్ల వలసిన పరిస్థితి ఏర్పడింది గత ప్రభుత్వం లో బ్రిడ్జ్ నిర్మాణం కోసం డీఎంఎఫ్ నిధులు పదిహేను లక్షలా రూపాయలు కేటాయిస్తూ అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి 06/10/2023 రోజున శంకుస్థాపన చేశారు.

పనులు మాత్రం ప్రారంభం కాలేదు వర్షకాల ప్రారంభంలో వాగు పైనుండి బారీ మొత్తంలో నీరు పోవడంతో వాగు పై వర్షా కాలంలో రాకపోకలకు చాలా ఇబ్బంది అయింది దీనిని వార్తాపత్రికల ద్వారా అధికారులు తెలియజేయడంతో టెం డర్ల ద్వారా బ్రిడ్జ్ నిర్మాణం పనులు కాంట్రాక్టర్ కు ఇవ్వ డంతో కాంట్రాక్టర్ హుటాహుటిన బ్రిడ్జ్ నిర్మాణం పనులు ప్రారంభించి గత 20 రోజుల నుండి పనులను చేయడం లేదని కాలనీ వాసులు వివరించారు. ఇప్పటికైనా అధికారు లు స్పందించి మధ్యలో ఆగిపోయిన బ్రిడ్జ్ నిర్మాణం ప నులను పూర్తి చే యాలని సూర్యోదయ కాలనీ మందగూడ వాసులు కూడా వెల్లడించారు.

మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు

ఇల్లందు, నేడున్యూస్: తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ,గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన సందర్భంగా ఇల్లందు లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమాని సుమన్ ఆధ్వర్యంలో పాత శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇల్లందు గవర్నమెంట్ హాస్పిటల్ లో రోగులకు పాలు, పండ్లు,బేడ్ పంపిణీ చేశారు.అయిత వారి ఫంక్షన్ హాల్ లో వైద్య శిబిరం నిర్వించి మంత్రి పుట్టిన రోజుకు ఆదేర్ల రవి హాజరై మాట్లాడుతూ గొప్ప మనసున్న మహా నాయకుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకను జరుపుకోవడం చాలా గొప్ప విషయం అన్నారు. పెదల పట్ల తన కున్న ఆప్యాయత అనురాగం పట్టుదల ప్రజలే ప్రాణంగా జీవిస్తున్న మహా నాయకుడికి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆయురారోగ్యాలతో నూరేళ్లు వర్ధిల్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో దీపక్, సుమన్,దిలీప్,సతీష్,శ్రీకాంత్,నాని,నవీన్,వినయ్ నాయుడు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

మెదక్‌టౌన్,నేడున్యూస్ : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అదేశాల మేరకు, జస్టిస్.లక్ష్మీ శారద గౌరవ చైర్ పర్సన్ కమ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ సూచనల మేరకు జస్టిస్ జితేందర్ , సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ సబ్ జైలు మెదక్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జైల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ జైలు సిబ్బంది జైలు ఖైదీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మొయినాబాద్, నేడున్యూస్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విదానాన్ని పునరుద్దరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశిరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అజీజ్నగర్లో జిల్లా కమిటీ సమావేశం జరగగా అందులో మొయినాబాద్ మండల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎం. తుకారం, ప్రధాన కార్యదర్శిగా వినోద్ యాదవ్, గౌరవ అధ్యక్షుడిగా మహిపాల్ రెడ్డి, కోశాధికారిగా మహేందర్, ఉప్యాధ్యక్షురాలిగా లలిత నియామితులయ్యారు. ఈ కార్యక్రమంలో జోసెఫ్ రెడ్డి, చంద్రశేఖర్డ్, కృష్ణ, అరుణ్కుమార్, వెంకటేశ్వర్రెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

మొయినాబాద్, నేడు న్యూస్: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ సూచించారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి మండల పరిధిలోని హిమాయత్ నగర్ గ్రామంలోని రైతుల వద్ద ఉన్న పశువులకు టీకాలు వేసే కార్యక్రమంలో పాల్గొని టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయ సిబ్బంది పద్మ. ప్రసన్న కుమార్, భీంరావు, ఘోరేమియా పాడి రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఉన్నత విద్య

హైదరాబాద్, నేడున్యూస్: తెలంగాణలోని ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యను టి-సాట్ ద్వార అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాల కిష్టారెడ్డి అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌ని టి-సాట్ కార్యాలయాన్ని ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఇ.పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తో కలిసి సోమవారం సందర్శించారు. టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డిబాలకిష్టారెడ్డి బృందానికి ఈ సందర్భంగా స్వాగతం పలికారు. సీఈవో తన ఛాంబర్ లో టి-సాట్ పనితీరు, ప్రాథమిక, ఇంటర్మీడియట్, పోటీ పరీక్షలు, ఇతర విభాగాలకు ఏ విధంగా ఉపయోగపడుతుందో బాలకిష్టారెడ్డి బృందానికి వివరించారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఏస్ శిరీష

*** ఘనస్వాగతం పలికిన భార్ అసోసియేషన్**

రామన్నపేట్,నేడున్యూస్: రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏస్ శిరీష ని భార్ అసోసియేషన్ సాదరంగా ఆహ్వానించి పూల గుచ్చం తో స్వాగతం పలకడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం ఏ మజీద్, కార్యదర్శి కేమ రామదాసు, సీనియర్ అడ్వకేట్స్ కంపాటి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ డిఈఈని కలిసిన యూఈఈయూ నాయకులు

మెదక్‌టౌన్,నేడున్యూస్: విద్యుత్ శాఖలో నూతనంగా పదవీ భాద్యతలు చేపట్టిన మెదక్ విద్యుత్ డిఈఈ షేక్ చాంద్ భాషాను సోమవారం మెదక్ డివిజన్ కార్యాలయం లోని ఆయన ఛాంబర్ లో యూఈఈయూ వర్కింగ్ ప్రెసిడెంట్ బిభానప్ప, జిల్లా అడ్వైజర్ స్వామి, నాయకులుసురేష్, శ్రీను, నరేష్, రాజు, దశరథ్ తదితరులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ స్టేషన్ లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలోని ఆయన ఛాంబర్ లో యూఈఈ వర్కింగ్ ప్రెసిడెంట్ బసవప్ప జిల్లా అడ్వైజర్ స్వామి నాయకులు సురేష్ శీను నరేష్ రాజు దశరథ్ తదితరులు కలిసినన వున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ స్టేషన్ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు

రైస్‌మిల్ వేలం పాట

*** తహసిల్దార్ గఫార్ మియా**

కొల్చారం,నేడున్యూస్: ప్రభుత్వం గత కొన్ని నెలల క్రితం శ్రీధర్ గుప్త నుండి జప్తు చేసిన రైస్ మిల్ మండల పరిధిలోని వరిగుంతం గ్రామ శివారులో గల సీతా రామాంజనేయ రైస్ మిల్ ను నేడు మంగళవారం వేలం వేస్తున్నట్లు కొల్చారం తాసిల్దార్ గఫార్ మియా అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు మంగళవారం కొల్చారం తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో 11 గంటలకు సీతా రామాంజనేయ రైస్ మిల్ వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు 10 లక్షల డిడి, లేదా 10 లక్షల నగదు రూపంలో తాసిల్దార్ కార్యాలయంలో చెల్లించిన వారు వేలంపాటలో పాల్గొనడానికి అర్హులని నేడు వేలంపాటలో పాల్గొనవచ్చని తాసిల్దార్ గఫార్ మియా అన్నారు.

విద్యార్థులకు వినూత్న ఐడి కార్డులు

*** ఎమ్మెల్యే మల్లారెడ్డి**

మేడ్చల్, నేడున్యూస్: దేశంలోనే తొలిసారిగా మల్లారెడ్డి విశ్వవిద్యాల్లో ఓ వినూత్న, సృజనాత్మక ప్రయోగం చేపట్టడం ద్వారా చరిత్ర సృష్టించబోతుందని మేడ్చల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఇటీవల విశ్వవిద్యాలయంలో చేరిన విద్యార్థులకు సోమవారం అందజేసిన గుర్తింపు కార్డులలో చిప్పును అమర్చి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఆంజనేయులు, ప్రథమ సంవత్సర ఇంజనీరింగ్ విద్యార్థుల విభాగం అధిపతి డాక్టర్ సుజిత్ స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య ధనుంజనా చారి, ఐసిఐసిఐ బ్యాంక్ ఉన్నత అధికారులు రాహుల్ గాడ్సే, శివ పాలపర్తి లు పాల్గొన్నారు.

ఘనంగా సిపిఎం జెండా ఆవిష్కరణ వేడుకలు

చంపాపేట్,నేడున్యూస్: చాంద్రాయణగుట్ట జోన్ సీపీఎం 4వ మహాసభలు సీపీఎం జంగంమేట్ ఆఫీస్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమం సందర్భంగా జెండా ఆవిష్కరణ సీపీఎం సీనియర్ నాయకులు ఎం.లక్ష్మమ్మ ఆవిష్కరించారు. అనంతరం మహా సభ ప్రారంభించారు.3 సంవత్సరాల జోన్ రిపోర్ట్ ను కోటయ్య ప్రవేశపెట్టిగా దానిపై సభ్యులు చర్చించి అభిప్రాయంతో ఆమోదించారు. ఈకార్యక్రమంలో తిరుపతి, కృష్ణ మోహన్, ఫర్జానా, లక్ష్మీ,హాసలి, సుధాకర్, సోమన్న, చిన్న, మురారి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

మేడ్చల్, నేడున్యూస్: కండరాల మానియా మాస్టర్స్ విభాగం లో మేడ్చల్ కు చెందిన ఎక్స్ ట్రిమ్ జిమ్ కు చెందిన కోచ్ శంకర్ సింగ్ సీనియర్ మాస్టర్స్ క్లాసిక్ లో కండరాల మానియా మాస్టర్ విభాగంలో మొదటి స్థానాన్ని సాధించారు. అతని అ త్యుత్తమ ప్రదర్శనకు బెంగళూరులో జరిగిన ప్రతిష్టాత్మక షోలో ఈ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా మేడ్చెల్ లో ఎక్స్ ట్రిమ్ ఫిట్నెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించింది. ఈ సందర్భంగా ఎక్స్ ట్రీమ్ ఫిట్ నెస్ జిమ్ నిర్వాహకులు మాట్లాడుతూ మా జిమ్ కు చెందిన కోచ్ కు సీనియర్ మాస్టర్ క్లాసిక్ లో కండరాల మానియా మాస్టర్ విభాగంలో మొదటి స్థానం సాధించడం ఆనందంగా ఉందని, ఆరోగ్యం ఫిట్ నెస్ ను సాధించడానికి జిమ్ లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మేడ్చల్ లోని చెక్పోస్ట్ వద్ద ఉన్న ఫిట్‌నెస్ జిమ్‌ను వినియోగించుకోవాలని కోరారు.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు

బయ్యారం, నేడున్యూస్: బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బయ్యారం మండల నాయకులు పిఎసిఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,కంబాల ముసలయ్య, సనప సోమేష్, బత్తిని రామ్మూర్తి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

* డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి

హైదరాబాద్,నేడున్యూస్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి డిప్యూటీ మేయర్ జిహెచ్ఎంసి ఉన్నతాధికారులతో కలిసి విజ్ఞప్తులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆయా అధికారులకు సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా సమస్యను పరిష్కరించి సంబంధిత ఆర్జీదారులకు తెలియజేయాలని, పరిష్కారం కానట్లయితే అందుకు గల కారణాలు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. ఆయా విభాగాలకు అందిన ఆర్జీలను పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మిషనర్లు నళిని పద్మావతి, యాదగిరి రావు, చంద్రకాంత్ రెడ్డి, పంకజ, సత్యనారాయణ, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసిపి గంగాధర్, చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్ ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్గధామం ఉమామహేశ్వరం

* కోటి రూపాయలతో అభివృద్ధి పనులు
* ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్. బీరం మాధవరెడ్డి

అచ్చంపేట,నేడున్యూస్: శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం పర్యాటకులు, భక్తులకు ఎంతో ఆహ్లాదాన్నిస్తూ పర్యాటకులను పరవశింప చేస్తుందని ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూఆలయంలో భక్తులకు కావలసిన ఏర్పాట్లతో పాటు, పర్యాటకపరంగా అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలని లక్ష్యంతో రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణలతోడ్పాటుతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు మాధవరెడ్డి తెలిపారు. భోగ మహే శ్వరంలో 50 లక్షల రూపాయలతో కళ్యాణ మండపం ఆధు నికరణ, మరో 50 లక్షలతో హనుమాన్ దేవాలయం పునర్ని ర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఉమామ హేశ్వరం కొండపైకి ఎక్కే మెట్ల మార్గంలో 40 అడుగుల ఎత్తుఎత్తు గల శివ శివుడి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అదేవిధంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భోగ మహేశ్వరం నుండి ఉమా మహేశ్వరం కొండపైకిరోప్ వే ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు రంగాపురం నుం డి ఉమామహేశ్వరం వరకు ప్రధాన రహదారిని డబల్ రోడ్డుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు మాధవరెడ్డి తెలిపారు. ఆల యంలో ఎలాంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా దాత లు ఇచ్చే విరాళాలకు సంబంధించి ఆన్లైన్సిస్టం తీసుకురావ డం జరుగుతుందని, మాన్యువల్ సిస్టన్నీ ఎత్తివేయడం జరు గుతుందన్నారు. దీనివల్ల ఎలాంటి అవినీతికి పాల్పడే అవకాశం ఉండదని తెలిపారు.

సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సమావేశం

ఘట్కేసర్, నేడున్యూస్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సుప్రభాత్ టౌన్ షిప్ కొ్రెములలో తెలంగాణ ఆల్ స్టేట్ సీనియర్ సిటిజన్స్ సమావేశం యూనిట్ అధ్యక్షులు బంగారి రాజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి టాస్కా రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఘట్ కేసర్ మండల అధ్యక్షులు తోట రంగయ్య ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సమావేశంలో పలువురు సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పాల్గొని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యలైన పెన్షన్ పెంపు, హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు అన్నిరకాల వైద్య సేవలు కార్పొరేట్ హాస్పిటల్లో నందు అపరిమితంగా ఇప్పించేందుకు, మెడికల్ రి-ఎంబర్స్మెంట్ బిల్లులను త్వరితగతిన చెల్లించాలని, వారికి రావలసిన రివైజెడ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్, పెన్షన్ బకాయిల చెల్లింపు, స్వంత ఇంటి పథకం కొరకు 200 గజాల భూమి, తెల్ల రేషన్ కార్డుల తదితర సమస్యలపై టాస్కా నాయకులు స్పందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకొని పోయి పరిష్కరించాలని తీర్మానించారు. సీనియర్ సిటీజన్లకు కూడ ఉచిత బస్సు సౌకర్యం, సుప్రభాత్ టౌన్ షిప్ నందు వృద్ధులకు ప్రత్యేక ఓపెన్-జిమ్ వచనాలయం నిర్మించాలని,నారపల్లిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారానికి రెండు సార్లు ప్రత్యేకంగా వయోధికులకు మాత్రమే రక్త పరీక్షలు చేసి మందులు ఇచ్చేఏర్పాటు చేయాలని తెలిపినారు.

ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు కొట్టే మల్లయ్య, ఎస్.లక్ష్మీనారాయణ, ఎం.రాజనర్సు, ఎర్రప్రభాకర్, ఎన్.ప్రతాప్ సింగ్, సలహాదారులు చుక్కల నర్సయ్య ఎం.సత్యనారాయణ, బంగారి మల్లయ్య, వెంక ట్ రెడ్డి, సర్జిత్ సింగ్, రఫిక్, దైవ ధీనం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

* జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, నేడున్యూస్: వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ. రావుల గిరిధ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలుసూచనలు చేయడమైనది. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 8 మంది ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలియజేశారు. ప్రజావాణిలో మొత్తం 08ఫిర్యాదులు,4,భూతగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు,4, పరస్పర గొడవల కు సంబంధించిన ఫిర్యాదులు వున్నాయి.

శిక్ష నుండి తప్పించుకోలేరు

* గొడవ పడిన కేసులో నిందితునికి 1 సంవత్సరం జైలు శిక్ష జరిమాన
* జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు తప్పవు
*వనపర్తి డిఎస్పీ జె.వెంకటేశ్వరరావు

వనపర్తి క్రైమ్, నేడు న్యూస్: వనపర్తి జిల్లా గోపాలపేట మండలం, గోపాల పేట గ్రామం నందు ఒక వ్యక్తి ఇక్కడ ఒక గొడవకు కారణమై రాయితో గాయపరిచిన వ్యక్తికి 1 సంవత్సరం జైలు శిక్ష 500 రూపాయల జరిమానా, విధిస్తూ వనపర్తి కోర్టు రెండవ అదనపు ప్రధాన న్యాయమూర్తి వై, జానకి సోమవారం రోజున తీర్పు వెల్లడించినట్లు వనపర్తి డిఎస్పీ తెలిపారు. డిఎస్పీ తెలిపిన వివరాలు వనపర్తి జిల్లా గోపాల్ పేట్ మండలం , గ్రామానికి చెందిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన వ్యక్తులను పొలం దగ్గరకు వెళ్లే దారి విషయంలో గొడవపడి రాళ్లతో దాడి చేసి గాయాల పాలు చేశారు. తీవ్రంగా గాయపడ్డ పిర్యాదుదారులు తేది 22-12-2021 గోపాల పేట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఈ సంఘటనపై అప్పటి మొదటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నవీద్ (గోపాల పేట్ ఎస్సై), క్రైం నెంబర్ 145/2021 కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కోర్టు కానిస్టేబుల్ రమేష్ నాయక్ కోర్టులో నిందితుని ప్రవేశపెట్టగా ,ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ రజేష్ వాదించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన రెండవ అదనపు న్యాయమూర్తి వై, జానకి నేరం రుజువు కావడంతో నిందితునికి 1 సంవత్సరం జైలు శిక్ష తో పాటు 500 రూపాయల జరిమానా విధించినట్లు వనపర్తి డిఎస్పీ తెలిపారు.పైకేసులో నిందితులకి శిక్ష పడటంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, రాజేష్, వనపర్తి సీఐ, క్రిష్ణ , గోపాల్ పేట్ ఎస్ఐ,నరేష్ ,కోర్ట్ కానిస్టేబుల్, రమేష్ నాయక్ లను డిఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వివాహానికి పుస్తె మట్టలు అందజేత

కొల్చారం,నేడున్యూస్: పేదింటి ఆడపడుచు వివాహానికి పుస్తె మట్టలు అందజేసిన బిజెపి నాయకులు రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు రఘువీర రెడ్డి సహకారంతో కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు తూర్పాటి కిష్టయ్య, పోచమ్మ దంపతుల కుమార్తె సంపూర్ణ వివాహానికి సోమవారం పుస్తె,మె ట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాతూరి దయాకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గుండు నాని, పోతిరెడ్డిపల్లి బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలి

* టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ.

వనపర్తిటౌన్, నేడున్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రకటించిన ఒక్క డిఏ ను పునః సమీక్షించుకోవాలని టీఎస్ యుటిఎఫ్ వనపర్తి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం సాయంత్రం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రవి ప్రసాద్ గౌడ్, డి కృష్ణయ్య ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లాంచాల్సిన ఐదు డి ఏ ల విడుదల విషయంలో ప్రభుత్వ వైఖరి శోచనీయంగా ఉందన్నారు.ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమావేశం అనంతరం కేవలం ఒకే ఒక డిఏ మాత్రమే ప్రకటించడం ఉద్యోగ ఉపాధ్యాయులను తీవ్రంగా నిరాశ పరచిందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో టి.ఎస్.యు.టి.ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు హమీద్, జిల్లా కార్యదర్శులు బి వెంకటేష్, పి.శ్రీనివాస్ గౌడ్, తిమ్మప్ప,తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 8న ఎన్టీఆర్ ట్రస్టీ ప్రవేశపరీక్ష

* విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
* ఎన్టీఆర్ విద్యసంస్థల డీన్ ఎన్.వీ. రామారావు

మొయినాబాద్, నేడున్యూస్: ఎన్టీఆర్ విద్యాసంస్థల ఉపకార వేతనం కోసం ఈ ఏడాది డిసెంబర్ 8వ తేదిన బాలికా విద్యా స్కాలర్షిప్ (జీఈఎస్టీ) పరీక్షను మొయినాబాద్ మండలం హిమయత్ నగర్ గ్రామ సమీపంలోని గండిపేట చెరువు ఒడ్డునగల ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో నిర్వహిం చనున్నట్లు ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ ఎన్.వీ. రామారావు పేర్కొన్నారు. మొయినాబాద్ మండలం హిమయత్ నగర్ లోని ఎన్టీఆర్ విద్యసంస్థల కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మనసున్న మా రాజు పొంగులేటి

ఇల్లందు,నేడున్యూస్: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి, మనసున్న మారాజు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఇల్లందు పట్టణంలోని పొంగులేటి ప్రధాన అనుచరలైనటువంటి 19 వ వార్డు కౌన్సిలర్ పత్తి స్వప్న రంజిత్ దంపతులు 19వ వార్డులోని నిరుపేదలైనటువంటి సత్తయ్య,రాములు కుటుంబాలకు ఇంటి పై కప్పు రేకుల కొరకు ఆర్థిక సహాయం అందజేశారు.వార్డు ప్రజల కష్టసుఖల్లో భాగస్వాములవుతున్న కౌన్సిలర్ పత్తి స్వప్న రంజిత్ దంపతులను వార్డు ప్రజలు అభినందించారు.

ప్రజావాణి సమస్యలను పరిష్కరించండి

* అధికారులను ఆదేశించిన పీర్జాదిగూడ నగర మేయర్ అమర్ సింగ్

పీర్జాదిగూడ,నేడున్యూస్: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్ కోరారు. పీర్జాదిగూడ నగర పాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలు ఫిర్యాదులు వచ్చాయని మేయర్ అమర్ సింగ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వరరావు, డిఈ సాయినాథ్ గౌడ్, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

* సిఐటియు కడప జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి

కడప, నేడున్యూస్: 104 ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కడప జిల్లా సిఐటియు అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి కోరారు. కడప నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో 104 ఉద్యోగుల జిల్లా కమిటీ సమావేశాలు సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ 104 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మహమ్మద్ అలీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనురు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో 104 ఉద్యోగులు తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాబావల్లి మహమ్మద్ అలీ, నాగమల్లేశ్వరరావు, మహబూబ్ బాషా, నాగేంద్ర, సురేష్ కృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ జన్మదిన వేడుకలు

మేడ్చల్,నేడున్యూస్: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం బొరంపేట 16వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వార్డు ప్రజలు కేక్ కట్ చేసి కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డ్ కౌన్సిలర్ మురళి యాదవ్ ఆ కాలనీ వాసులు విక్రం సింహారెడ్డి, భూషణ్, శ్యామ్, సుధాకర్ బేబీ యోగి మురళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మేఘన్న అభయస్తం

వనపర్తిబ్యూరో,నేడున్యూస్: వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో మరణించిన దాసర్ల అక్కమ్మ కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి 12 వ వార్డుకు చెందిన దాసర్ల అక్కమ్మ సోమవారం మరణించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం శ్రీనివాసులు మన్యం ఎం రమేష్ కె రమేష్ జి సత్యనారాయణ ఆర్ రాములు ఎం శాంతయ్య ఎం నాగన్న ఎం పెద్ద వెంకటయ్య అందరూ కలిసి మరణించిన దాసర్ల అక్కమ్మ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది.

పోరాటాలు ఆగవు

- రాష్ట్రంలో గందరగోళంగా ఉన్న విద్యావ్యవస్థను పట్టించుకోని రేవంత్ రెడ్డి
- ముఖ్యమంత్రి వద్ద విద్యాశాఖ ఉన్న విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

హైదరాబాద్,నేడున్యూస్: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థుల చదువులు కొనసాగేది ఎట్లా అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ అన్నారు. గతంలో ఫీజు బకాయిలపై ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలకు నేడు చేస్తున్న వాటికి ఎటువంటి పొంతన లేదని, సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యం వలన విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామక్రిష్ణ, బానోత్ రాఘురాం, గ్యార నరేష్,నాగ జ్యోతి, లెనిన్ పాల్గొన్నారు.

రైతులకు సంకెళ్లు వేసిన ఘనత బిఆర్ఎస్‌ది

వనపర్తిటౌన్, నేడున్యూస్: రైతులకు సంకెళ్లు వేసి కోర్టుకు పంపించిన ఘనత బిఆర్ఎస్‌కు దక్కిందని మలిదశ ఉద్యమకారు డుకాంగ్రెస్ పార్టీ మండ్ల దేవన్న నాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. వనపర్తిలో రైతు ధర్నా పేరుతో ఇక్కడున్నరై తులను ప్రజలను మభ్య పెట్టడం తప్ప పది సంవత్సరాల లో లక్ష రుణమాఫీ చేయని బిఆర్ ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభు త్వం ఎనిమిది నెలల్లో రెండు లక్షల రుణమాఫీ చేసింది. రైతు ధర్నా చేసి నైతికహక్కు మీకు లేదని, అన్నారు మాజీ మంత్రి చే యాల్సింది రైతు నిరసన సదస్సు కాదు రెండు లక్షల రుణ మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలాభిషేకాలు చేయాలని అన్నారు.

ప్రజావాణిలో వినతి

కొల్చారం,నేడున్యూస్: కొల్చారం మండల పరిధిలో రాంపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో రుణమాఫీ పొందిన 106 మందికి రైతులకు తిరిగి రుణాలు ఇప్పించాలని సోమవారం మెదక్ కలెక్టరేట్ లోని నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు కు సోమవారం రాంపూర్ గ్రామ రైతులు మల్లేశం గౌడ్, జంగిటి పోచయ్య, నెల్లి రాజు, మహేందర్ రెడ్డి, విఠల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రైతులు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు మన్నారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

* ఎంఎల్ఎ రాకేష్ రెడ్డి

ఆలూరు,నేడున్యూస్: మాక్లూర్ మండలనికి చెందినా లబ్ధిదారులకు 160 మందికి మక్లూర్ ఎంపిడివో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు ఎంఎల్ఏ మాట్లాడుతూ ఇప్పటివరకు, 3500 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయడం జరిగిందని, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో నిరుపేదలను ఆదుకుంటామని అన్నారు.

తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం.

పొగాకుతో క్యాన్సర్ ముప్పు

తిరుపతి బ్యూరో, నేడున్యూస్ : స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, పొగాకు ఉత్పత్తులను వినియోగించే వారికి నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు పొంచి ఉందని పేర్నాడు వైద్యాధికారి డాక్టర్ ఐ.రమణయ్య తెలిపారు. స్విమ్స్,బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో సోమవారం పేర్నాడు పిహెచ్ సి పరిధిలోని కోటపోలూరు-2 సచివాలయంలో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది.ఈ కార్యక్రమంలో స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి. పద్మావతి, సర్పంచ్ గోవర్ధన్, సచివాలయ కార్యదర్శి ప్రభాకర్, స్థానిక నాయకులు సుధాకర్ రెడ్డి, వై.వాణెమ్మ,హెచ్ఇఓ రవికుమార్, పిహెచ్ ఎన్ నాగమణి, సూపర్వైజర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించడమే లక్ష్యం

* మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు/ అనంతసాగరం, నేడున్యూస్: క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా అన్ని మండల కేంద్రాల్లో ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం ఉదయం అనంతసాగరం మండల కాంప్లెక్స్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, తాసిల్దార్ సుధీర్, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు బొల్లినేని గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సునీత, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఇసుక రిచ్ లు

నెల్లూరు,నేడున్యూస్: నగర పరిధిలో నూతనంగా నాలుగు ఇసుక రీచ్ లను గుర్తించినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుండి నగరంలోని 54వ డివిజన్లో పెన్నా నదికి ఇరువైపులా విస్తృతంగా పర్యటించిన మంత్రి నారాయణ సాయంత్రం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఇతర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

పోర్టు సీఈఓతో సోమిరెడ్డి భేటీ

* అదానీలకు దండం పెట్టి అడుగుతున్నాం
* కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించండి
* ఎంఎల్ఏ సోమిరెడ్డి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

నెల్లూరు/ముత్తుకూరు, నేడున్యూస్: జిల్లా పరిధిలోని, సర్వేపల్లి నియోజకవర్గంలో ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ ను పునరుద్ధరించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్ట్ యాజమాన్యానికి దండం పెట్టి అడుగుతున్నామని, పోర్ట్ కంటైనర్ అని ను పునరుద్దించాలని వేడుకుంటున్నామని ఆయన అన్నారు. అవసరమైతే కాళ్లు పట్టుకుంటాం, లేదంటే పోరాటానికి దిగుతాం అంతేకానీ గత ప్రభుత్వంలో పాలకుల మాదిరిగా బొల్లికూతలతో కాలయాపన చేయబోం అని అన్నారు. అఖిలపక్ష నాయకులతో కలిసి పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ తో భేటీ అవడం జరిగిందని, కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించాల్సిన అవసరాన్ని సీఈఓకు స్పష్టంగా అఖిలపక్ష పార్టీల నాయకులు వివరించడం జరిగిందన్నారు. కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణకు సంబంధించి కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ తో చర్చలు జరిపామని, శ్రీ కృష్ణదేవరాయల కాలంలో ప్రారంభమైన కృష్ణపట్నం పోర్టును ఈ రోజు అదానీ యాజమాన్యం మూసివేసే పరిస్థితి తేవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించాం అని అన్నారు.ఎగుమతులు, దిగుమతులును కాటుపల్లి, ఎన్నూరులకు మార్చి కాలుష్యం వెదజల్లే బొగ్గు, బూడిదను మా ప్రజలపై రుద్దుతారా అని అడిగాం అని,మా రైతులే పండించే బియ్యం, పత్తి, పొగాకు, ఎండుమిర్చితో పాటు చేపలు, రొయ్యలు గతంలో కృష్ణపట్నం పోర్టుకు ఒక్కరోజులోనే చేరేవి, ఇప్పుడు కాటుపల్లి, ఎన్నూరులలో వారం రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడటంతో పాటు పెరిగిన రవాణా ఖర్చుల భారం కూడా రైతులపైనే పడుతోంది ఆయన అన్నారు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓతో సోమిరెడ్డితో కలిసి చర్చల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, రవీంద్రరెడ్డి, సంపత్ కుమార్, సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇన్ చార్జి బొబ్బేపల్లి సురేష్ నాయుడు, సీఐటీయూ నేత మోహన్ రావు, సీపీఐ నాయకుడు శంకర్ కిషోర్, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు అనంతసాగరం, నేడు న్యూస్: ప్రత్యేక ప్రజా విజ్ఞాపనల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం అనంతసాగరం మండల కేంద్రంలో సచివాలయాల ఉద్యోగులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ మండల స్థాయి అధికారులు ప్రజల కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలలో భాగస్వాములై సహక రించాలన్నారు. స్థానిక సంస్థల పదవీకాలం 18 నెలలో ముగుస్తున్నందున గ్రామాల అభివృద్ధి కి కలసి రావాలన్నారు.

అందరూ కూడా అభివృద్ధి పనుల్లో ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆత్మకూరు ఆర్డీవో పావని, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, తాసిల్దార్ సుధీర్, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు బొల్లినేని గిరినాయుడు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, సునీత, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

- సర్కిల్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ బాషా

కోట,నేడున్యూస్: కోట, వాకాడు, చిట్టమూరు మండల ప్రజలు దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా విక్రయించే దుకాణదారులు, తయారీ కేంద్రం వారు అనుమతులు తప్పనిసరి అని వాకాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ హుస్సేన్ భాష పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో బాణాసంచా దుకాణాలు ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగిన భద్రత ప్రమాణాలు పాటించాలి అన్నారు. మండే స్వభావం కలిగిన పెట్రోల్, అగ్గిపెట్టెలు దూరంగా ఉంచాలన్నారు. దురదృష్టవశాత్తు దుకాణాల సమీపంలోఅగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవలసిన నివారణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అధికారులు నిర్దేశించిన ప్రాంతాలలో. మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ధ్వని కాలుష్యం నివారించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. దీపావళి పండుగను వాకాడు సర్కిల్ పరిధిలో ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఇంచార్జ్ మంత్రికి ఘనసాగతం

రేణిగుంట, నేడు న్యూస్: తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ కి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పి సుబ్బ రాయుడు, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, ఎమ్మెల్యే శ్రీకాళహస్తి బొజ్జల సుధీర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

గూడూరు, నేడున్యూస్: ఎల్ఐసి యాజమాన్యం ఏజెంట్లకు వ్యతిరేకంగా అనేక సంస్కరణలో తీసుకువచ్చిందని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నాయకులు స్పష్టం చేశారు. ఈ సంస్కరణలకు వ్యతిరేకంగా గూడూరు ఎల్ఐసి కార్యాలయం ముందు సోమవారంనిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఏజెంట్లు వ్యతిరేకిస్తున్న విధానాలను రద్దు చేసి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్లపై తిరుగుతున్న పశువులు పట్టించు కొని అధికారాలు

గూడూరు, నేడున్యూస్: పట్టణంలో పశువులు ప్రధాన రహదారుల పైనే సంచరిస్తూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.కొంతమంది పశువులను యజమానులు రోడ్డుపై వదిలేయడంతో రోడ్లపైనే సేద తీరుతున్నాయి.

మంత్రితో గూడూరు ఎమ్మెల్యే, బిజెపి గూడూరు కన్వీనర్

వాకాడు, నేడున్యూస్: తిరుపతి జిల్లా ఇన్చార్జి మంత్రి,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తో శనివారం సమావేశం అయిన గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్, గూడూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పాపా రెడ్డి పురుషోత్తమ రెడ్డి. నియోజకవర్గంలోని పలు భూ సమస్యలను ఎమ్మెల్యే, పాపారెడ్డి లు రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని మంత్రికి సూచించగా, మంత్రి స్పందిస్తూ రెవిన్యూ సమస్యలను సత్వరం పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని వారి కి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యువ పరిశ్రమకు వేత్త, టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

బిజినెస్

ఈ రంగాలపై ఓ లుక్కేయండి

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు అవకాశాలున్నవివే

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలని మీరు యోచిస్తున్నట్టైతే.. అందుకు ఈ దీపావళియే సరైన సమయమని మెజారిటీ మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. పైగా కొన్ని రంగాలను పరిశీలించాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. వాటిలో మధ్య-చిన్నశ్రేణి ఐటీ కంపెనీలు, దేశీయ ఫార్మా సంస్థలు, పాత ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, టైర్ల తయారీ సంస్థల స్టాక్స్ అనుకూలంగా ఉన్నట్టు చెప్తున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నాయి. పలు దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. దీంతో చిన్నచిన్న మొత్తాల్లో పెట్టుబడులకు దిగాలని కూడా ఎక్స్‌పర్ట్స్ సలహా ఇస్తున్నారు.ఇందుకోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను ఎంచుకోవడం ఉత్తమమని అభిప్రాయపడుతున్నారు. వీక్లీ, మంత్లీ, త్రైమాసిక పద్ధతుల్లో పెట్టుబడులకు వీలుంటుందని, వెయ్యి రూపాయలతో కూడా మదుపును మొదలు పెట్టవచ్చంటున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సిప్‌ల్లోకి నిధుల వరద మునుపెన్నడూ లేనివిధంగా రూ.24,509 కోట్లుగా ఉండటం గమనార్హం. మొత్తానికి ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో పెట్టుబడులకు ఆకర్షణీయ రాబడులకు ఆస్కారం ఉందని పేర్కొంటున్నారు. అయితే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు స్టాక్ మార్కెట్ రిస్కులకు లోబడి ఉన్నందున నిపుణులను సంప్రదించి పెట్టుబడులకు దిగితే ఇంకా లాభించవచ్చు. అంతేగాక స్వల్పకాలిక పెట్టుబడుల కంటే దీర్ఘకాలిక పెట్టుబడులు కలిసొస్తాయన్న వాదనలూ ఉన్నాయి.

లాభాలతో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు..!

గతవారం నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ట్రేడ్ అయ్యాయి. ఇంట్రా డే ట్రేడింగ్ లో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ఒక శాతానికి పైగా పుంజుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 602.75 పాయింట్ల లబ్ధితో 80,005.04 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 158.35 పాయింట్లు పుంజుకుని 24,380.80 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ-50లో 36 స్టాక్స్ లాభాలతో స్థిర పడ్డాయి. శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ ఎంటర్ ప్రైజెస్, ఐసీఐసీఐ బ్యాంకు, విప్రో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ తదితర స్టాక్స్ 5.35 శాతం వరకూ పుంజుకున్నాయి. మరోవైపు కోల్ ఇండియా, బజాజ్ ఆటో, యాక్సిస్ బ్యాంక్, హీరో మోటో కార్ప్, బీఈఎల్ తదితర 14 స్టాక్స్ 3.76 శాతం వరకూ నష్టపోయాయి. ఎన్ఎస్ఈ స్మాల్ క్యాప్ -100 1.20 శాతం, మిడ్ క్యాప్ -100 0.83 శాతం లబ్ధితో ముగిశాయి. బ్యాంకింగ్ స్టాక్స్ తోపాటు అన్ని సెక్టార్లు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ పీఎస్ యూ బ్యాంక్ ఇండెక్స్ 3.78 శాతం, బ్యాంక్ నిఫ్టీ 0.93, నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ 0.27 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ మీడియా, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ రియాల్టీ, నిఫ్టీ హెల్త్ కేర్ ఇండెక్సులు ఒక శాతానికి పైగా పుంజుకున్నాయి.

హైదరాబాద్‌లో టీఐసీ అకాడమీ..

హైదరాబాద్: హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ హర్మనీ ప్లాజాలో టీఐసీ అకాడమీనిది ఇన్వెస్టర్ కో (టీఐసీ) ఏర్పాటు చేసింది. దీనిని సంస్థ ఫౌండర్లు రక్షత్ గోయెల్, టీఐసీ మాస్టర్ ఫ్రాంచైజీ నిర్వాహకులు విశ్వనాథ్ సామా, అకాడమీ ఫ్రాంచైజీ నిర్వాహకులు సంజయ్ దోల్వానీ ప్రారంభించారు. అకాడమీలో అందరికీ అర్థమయ్యే భాషలో స్టాక్ మార్కెట్, ట్రేడింగ్ గురించి నేర్పుతారు.ప్రతి ఒక్కరికి ఫైనాన్షియల్ మార్కెటింగ్ ట్రేడింగ్ అందుబాటులో ఉండాలన్న ఏకైక లక్ష్యంతో టీఐసీ అకాడమీని మొదలు పెట్టామని సంస్థ వెల్లడించింది. ఇక్కడ ట్రేడింగ్ నేర్చుకోవచ్చని, ప్రాక్టీస్ చేయొచ్చని, సంపాదించుకోవచ్చని తెలిపింది. ఫైనాన్షియల్ మార్కెట్‌లో ప్రతి వ్యక్తికి నాలెడ్జి, స్కిల్స్, మార్కెట్‌లో సంక్లిష్టతలను అధిగమించి విశ్వాసాన్ని, విజయం సాధించడానికి దారిచూపడమే తమ లక్ష్యమని పేర్కొంది. తమ

సొంత క్యాపిటల్‌తోనే ట్రేడింగ్‌పై శిక్షణ ఇస్తామని వెల్లడించింది. పెట్టుబడుల చుట్టూ అలముకున్న అయోమయాన్ని తొలగించి విశాలమైన ఫైనాన్షియల్ మార్కెట్లలో ప్రవేశించడానికి ముందు ఒక పటిష్టమైన తొలి అడుగు వేయడానికి టీఐసీ సహాయపడుతుందని తెలిపింది.

కీలక మైలురాయి దాటిన టాటా టైగోర్

ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్.. ఎలక్ట్రిక్ హ్యాచ్ బ్యాక్ కారు టాటా టియాగో.ఈవీ కీలక మైలురాయిని దాటేసింది. భారత్ మార్కెట్లో ఆవిష్కరించినప్పటి నుంచి 50 వేల కార్లు విక్రయించిన మైలురాయిని చేరుకున్నది. టాటా టియాగో.ఈవీ కారును 2022లో భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది టాటా మోటార్స్. దేశంలోనే అతి తక్కువ ధరకు లభిస్తున్న కారుగా టాటా టియాగో.ఈవీ నిలుస్తుంది. దేశంలోనే అతి తక్కువ ధరకు లభిస్తున్న ఎలక్ట్రిక్ హ్యాచ్ బ్యాక్ కార్లలో ఇదొకటి.టాటా మోటార్స్ ఐదు ఎలక్ట్రిక్ కార్లను విక్రయిస్తోంది. టియాగో.ఈవీ తోపాటు టాటా మోటార్స్.. టాటానెక్సాన్ ఈవీ, టాటా టైగోర్ ఈవీ, టాటా పంచ్.ఈవీ, టాటా కర్వ్.ఈవీ కార్లను విక్రయిస్తోంది. టాటా టియాగో.ఈవీ నాలుగు ట్రిమ్స్ ఆప్షన్లలో లభిస్తుంది. ఎక్స్ఈ, ఎక్స్ టీ, ఎక్స్ జడ్ +, ఎక్స్ జడ్ +లక్స్ వేరియంట్లలో టాటా టైగోర్.ఈవీ అందుబాటులో ఉంది. ఐదు రంగుల్లో టాటా టియాగో.ఈవీ లభిస్తుంది.టాటా టియాగో.ఈవీ కారు టీల్ బ్లూ, డయ్ టోనా గ్రే, ట్రోపికల్ మిస్ట్, ప్రిస్టిన్ వైట్,మిడ్ నైట్ ప్లమ్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది. 19.2కిలోవాట్లు లేదా 24 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లతో టాటా టైగోర్.ఈవీ ఇంజిన్ అనుసంధానమై ఉంటుంది. సింగిల్ చార్జింగ్ తో 315 కి.మీ దూరం ప్రయాణించడం టాటా టైగోర్.ఈవీ కారు స్పెషాల్టీ. ఈ కారు ధర రూ.12.49 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి మొదలై రూ.13.75 లక్షల (ఎక్స్ షోరూమ్) వరకూ పలుకుతుంది.

సినిమా

పెరిగిపోతున్న అంచనాలు



సాయి దుర్గ తేజ్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఎస్‌డిటి 18. రోహిత్ కేపీ దర్శకత్వం (డెబ్యూ) వహిస్తున్నాడు. ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మేకర్స్ ఇప్పటికే ఎస్‌డిటి 18 గ్లింప్స్ షేర్ చేయగా.. ఆర్కాడీ ప్రపంచంలోకి ప్రత్యేక ప్రవేశం.. అంటూ సాయి దుర్గ తేజ్ కండలు తిరిగిన దేహంతో శక్తివంతమైన శూలాన్ని పట్టుకొని స్టన్నింగ్ విజువల్స్‌తో పీరియాడిక్ ప్రపంచంలోకి తీసుకెళ్లనున్నట్టు చెబుతోంది.తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి తెరపైకి వచ్చింది. ఈ సినిమాకు నారప్ప, జార్జిరెడ్డి, రాక్షసులు సినిమాలకు పని చేసిన గాంధీ నడికూడికర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నాడు. గాంధీనడికూడికర్‌కు స్వాగతం చెబుతూ విడుదల చేసిన లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. పాన్ ఇండియా కథాంశంతో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ మూవీలో ఐశ్వర్యలక్ష్మి వసంత పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే షేర్ చేసిన వసంత లుక్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది.ఈ చిత్రం 1947 హిస్టరీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్నట్టు గ్లింప్స్ ద్వారా తెలుస్తుండగా.. సాయి దుర్గ తేజ్ యోధుడి పాత్రలో నటిస్తున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రాన్ని హనుమాన్ మేకర్స్ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు.

త్వరలోనే క్షమాపణలు..

టాలీవుడ్‌లో ఉన్న టాలెంటెడ్ యాక్టర్లలో ఒకరు శ్రీకాంత్ అయ్యంగార్. భిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించే ఈ నటుడు పొట్టేల్ సక్సెస్ మీట్‌లో రివ్యూ రైటర్ల గురించి మాట్లాడుతూ.. జీవితంలో షార్ట్ ఫిలిం కూడా తీయని నా కొడుకులు రివ్యూ రాస్తారా.. సినిమా తీయడం ఎంత కష్టమో రఫ్ ఐడియా కూడా లేదు.. అంటూ కామెంట్స్ చేశాడని తెలిసిందే.ఈ నేపథ్యంలో సినీ విమర్శకులపై చేసిన కామెంట్స్ నేపథ్యంలో ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ మా ప్రెసిడెంట్ మంచు విష్ణుకు ఫిర్యాదు చేసింది. శ్రీకాంత్ అయ్యంగార్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నది. ఈ నేపథ్యంలో రివ్యూ రైటర్లపై చేసిన కామెంట్స్ నెట్టింట దుమారం రేపడంతో తాజాగా ఓ వీడియోను షేర్ చేశాడు శ్రీకాంత్ అయ్యంగార్.పొట్టేల్ సినిమా సక్సెస్ మీట్‌లో కొన్ని మాటలు మాట్లాడా.. కొన్ని విషయాల్లో బాధ కలిగించాను. త్వరలో కరెక్ట్ విషయాల మీద మీ అందరికీ త్వరలోనే భేషరతుగా క్షమాపణలు చెప్పబోతున్నా. దయచేసి వేచి ఉండండి..అంటూ వీడియో సందేశాన్ని షేర్ చేశాడు. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

చిరంజీవితో బీవీఎస్ రవి సినిమా ప్లాన్

టాలీవుడ్ రైటర్ బీవీఎస్ రవి ప్రస్తుతం బాలకృష్ణ అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే సీజన్ 4తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఇటీవలే ఫస్ట్ ఎపిసోడ్ ఆహాలో ప్రీమియర్ కాగా మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు బీవీఎస్ రవి. ఈ సందర్భంగా ఆసక్తికర విషయమొకటి చెప్పి మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తున్నాడు. తన నెక్స్ట్ ప్రాజెక్ట్ చిరంజీవి, రవితేజతో ఉండబోతుందని చెప్పాడు. చిరంజీవి సినిమా గురించి మాట్లాడుతూ.. బలమైన సామాజిక సందేశంతో ఉంటుందన్నాడు. చిరంజీవి కమర్షియల్ హిట్స్‌ను ఇప్పటికే ప్రేక్షకులు చూశారు. ఈ సారి మాత్రం చిరంజీవిని మరింత సామాజిక దృక్పథం ఉన్న పాత్రలో చూపించే సమయం వచ్చిందన్నాడు. త్వరలోనే మరిన్ని వివరాలపై స్పష్టత అవకాశాలున్నాయని ఫిలిం నగర్ సర్కిల్ టాక్. మరి ఈ చిత్రానికి బీవీఎస్ రవి కథ, స్క్రీన్ ప్లేపైనే ఫోకస్ పెడతాడా..? లేదంటే డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తాడా.. అనేది తెలియాల్సి ఉంది. మరిన్ని వివరాలపై రాబోయే రోజుల్లో చిరంజీవి నుంచి కానీ, బీవీఎస్ కాంపౌండ్ నుంచి కానీ స్పష్టత వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.చిరంజీవి ప్రస్తుతం మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతున్న విశ్వంభరలో నటిస్తున్నాడు. షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రంలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బీవీఎస్ రవి మరోవైపు రవితేజతో కూడా సినిమా ప్లాన్ చేస్తున్నాడని చెప్పడంతో ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు సినీ జనాలు.

'దేవర' నుంచి 'దావుదీ' సాంగ్ ఫుల్ వీడియో రిలీజ్

ఎన్టీఆర్ కథానాయకుడిగా వచ్చిన దేవర చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.500 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం త్వరలో 50 రోజుల మార్క్‌ను అందుకోబోతుంది. అయితే ఈ మూవీ నుంచి మేకర్స్ తాజాగా దావుదీ ఫుల్ వీడియో సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఇప్పటికే ఆయుధా పూజ వీడియోను వదలగా.. రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. తాజాగా దావుదీ కూడా రావడంతో ఫ్యాన్స్ పండగా చేసుకుంటున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పించగా.. యువసుధా ఆర్ట్స్ పతకంపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె సంయుక్తంగా నిర్మించారు.

'దేవకీ నందన వాసుదేవ'లో స్పెషల్ రోల్

మహేశ్ బాబు మేనల్లుడు.. ప్రముఖ పారిశ్రామికవేత్త జయదేవ్ గల్లా తనయుడు అశోక్ గల్లా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం దేవకీ నందన వాసుదేవ. జాంబిరెడ్డి, హనుమాన్ చిత్రాల ఫేమ్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథనందిస్తుండగా.. గుణ 369 ఫేం అర్జున్ జంధ్యాలదర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం విడుదలకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. అయితే ఈ మూవీకి సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాలో అశోక్ గల్లా మామ సూపర్ స్టార్ మహేశ్ బాబు కామియో రోల్‌లో నటిస్తున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. కాగా దీనిపై చిత్రయూనిట్ అధికారిక ప్రకటన ఇవ్వవలసి ఉంది.ఈ సినిమాలో అశోక్ గల్లా సరసన హీరోయిన్‌గా మాజీ మిస్ ఇండియా (2020) మానస వారణాసి నటిస్తుంది. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబికా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ (ఎన్ఆర్ఐ) ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాకు సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందిస్తుండగా.. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రానికి ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రాఫర్ కాగా తమ్మిరాజు ఎడిటర్. ఇక కార్తికేయ హీరోగా అర్జున్ జంధ్యాల చివరగా డైరెక్ట్ చేసిన గుణ 369 బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. ఈ సారి ఎలాగైనా మంచి హిట్టు కొట్టాలని చూస్తున్నాడు అర్జున్ జంధ్యాల.

స్పోర్ట్స్

పాకిస్థాన్ కోచ్‌గా రిజైన్ చేసిన గ్యారీ క్రిస్టన్

కరాచీ: పాకిస్థాన్ పరిమితి ఓవర్ల క్రికెట్ కోచ్ గ్యారీ క్రిస్టన్‌తన పదవికి రాజీనామా చేశారు. అపాయింట్‌మెంట్ తీసుకుని ఆర్నెళ్లు గడవక ముందే .. పాకిస్థాన్ బోర్డు, ఆయన మధ్య చీలకలు వచ్చాయి. 2011 వన్డే వరల్డ్‌కప్ సమయంలో భారత కోచ్‌గా ఉన్న గ్యారీ క్రిస్టన్.. ఏప్రిల్‌లో పాకిస్థాన్ కోచ్‌గా నియమితుడయ్యారు. రెండేళ్ల పాటు కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. కానీ పాకిస్థాన్‌కు మరో కోచ్‌గా ఉన్న జేసన్ గిలెస్పీతో గ్యారీ క్రిస్టన్‌కు విభేధాలు వచ్చినట్లు తెలుస్తోంది.ఆటగాళ్లను ఎంపిక చేసే అధికారాలను ఎత్తివేయాలని బోర్డు నిర్ణయించింది. దీంతో క్రిస్టన్ ఆ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆటగాళ్ల ఎంపిక ప్రస్తుతం సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలోనే ఉంటుంది. త్వరలో గ్యారీ క్రిస్టన్ తన రాజీనామాపై అధికారిక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయి. పాకిస్థాన్ కోచ్‌గా వెళ్లడానికి ముందు.. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ కోచ్‌గా చేశారు.గ్యారీ క్రిస్టన్ రాజీనామాను ఆమోదించినట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఆస్ట్రేలియా పర్యటన వెళ్తున్న పాకిస్థాన్ జట్టుకు గిలెస్పీ కోచింగ్ బాధ్యతలు చేపట్టనున్నట్లు పీసీబీ తన ఎక్స్ అకౌంట్‌లో వెల్లడించింది.

పాక్ సారథిగా రిజ్వాన్

సెంట్రల్ కాంటాక్టులలో షహీన్ అఫ్రిదికి డిమోషన్

లాహోర్: పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కొత్త సారథి వచ్చాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆ బాధ్యతలను వికెట్ కీపర్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌కు అప్పజెప్పింది. సుమారు ఏడాదిన్నర కాలంగా ఫామ్‌లేమితో బాధపడుతూ జట్టును విజయవంతంగా నడపలేక పోతున్న మాజీ సారథి బాబర్ ఆజమ్ కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పగా ఆ స్థానాన్ని రిజ్వాన్ భర్తీ చేయనున్నాడు. త్వరలో పాక్.. ఆస్ట్రేలియా, జింబాబ్వే పర్యటనలకు వెళ్లనున్న నేపథ్యంలో పీసీబీ కొత్త సారథి పేరును ఖరారుచేయడం గమనార్హం.ఇక ఆదివారం పీసీబీ ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్టుల జాబితాలో స్టార్ పేసర్ షహీన్ షా అఫ్రిది 'ఏ' కేటగిరీ నుంచి 'బీ'కి పడిపోయాడు. టెస్టు సారథి షాన్ మసూద్.. 'డీ' నుంచి 'బీ'కు ప్రమోట్ అయ్యాడు. బాబర్, రిజ్వాన్ 'ఏ' కేటగిరీలో తమ కాంట్రాక్టులను నిలుపుకున్నారు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు బాబర్‌ను పక్కనబెట్టడంపై వ్యాఖ్యానించిన ఫకర్ జమాన్ సెంట్రల్ కాంట్రాక్టును కోల్పోయాడు.

టీమిండియా హెడ్‌కోచ్‌గా లక్ష్మణ్..

స్వదేశంలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఆడుతున్న భారత జట్టుకు నవంబర్‌లో బీజీ షెడ్యూల్ ఉంది. ఆస్ట్రేలియా పర్యటన ఉన్నందున ప్రస్తుతం హెడ్‌కోచ్ గౌతం గంభీర్ జట్టుతో పాటు వెళ్లనున్నాడు. ఈ నేపథ్యంలో తాత్కాలిక కోచ్ అవసరం ఏర్పడింది. అందుకని మాజీ ఆటగాడు వీవీఎస్. లక్ష్మణ్‌కు మరోసారి బాధ్యత అప్పగించాలని బీసీసీఐ పెద్దలు నిర్ణయించారు.నవంబర్‌లో దక్షిణాఫ్రికా పర్యటనకు లక్ష్మణ్‌ను ప్రధాన కోచ్‌గా నియమించనున్నారు. ఈ విషయమై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. లక్ష్మణ్‌తో పాటు నేషనల్ క్రికెట్ అకాడమీ కోచింగ్ బృంద కూడా దక్షిణాఫ్రికా వెళ్లనుందని సమాచారం.

ఇప్పటికే రెండుసార్లు భారత జట్టు తరఫున ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన హైదరాబాదీ లక్ష్మణ్‌కు కోచింగ్‌లో అనుభవం ఉంది. గతంలో ఐర్లాండ్ పర్యటనకు, టీ20 వరల్డ్ కప్ అనంతరం జింబాబ్వే టూర్‌కు లక్ష్మణ్ టీమిండియాకు తాత్కాలిక కోచ్‌గా పని చేశాడు. అందుకని ఈసారి గంభీర్ దక్షిణాఫ్రికా పర్యటనకు అందుబాటులో లేకపోవడంతో.. మరోసారి అదే పాత్రను పోషించాల్సిందిగా సెలెక్టర్లు, బీసీసీఐ పెద్దలు లక్ష్మణ్‌ను సంప్రదించారు.

సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలో భారత బృందం సఫారీ గడ్డపై 4 టీ20లు ఆడనుంది. తొలి మ్యాచ్ నవంబర్ 8న డర్బన్‌లో, గెబెర్హాలో రెండో టీ20 నవంబర్ 10న జరుగనున్నాయి. నవంబర్ 13న సెంచూరియన్‌లో, 15వ తేదీన జోహన్నెస్‌బర్గ్‌లో జరిగే చివరి రెండు టీ20ల్లో భారత్, దక్షిణాఫ్రికాలు తలపడనున్నాయి. దక్షిణాఫ్రికాతో పొట్టి సిరీస్ కోసం ఇప్పటికే సెలెక్టర్లు 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు. ఐపీఎల్‌లో అమితంగా రాణించిన రమన్‌దీప్ సింగ్, బౌలర్ విజయ్‌కుమార్ వైశాక్, యశ్ దయాల్‌లను ఎంపిక చేశారు.

టీ 20 స్క్వాడ్ : సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజా శాంసన్(వికెట్ కీపర్), రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమన్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, విజయ్‌కుమార్, అవేశ్ ఖాన్, యశ్ దయాల్

షమీ లేకపోవడం రోహిత్ సేనకు పెద్ద ఎదురుదెబ్బే

సిడ్నీ: త్వరలోనే ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన సీనియర్ పేసర్ మహ్మద్ షమీ లేకపోవడం రోహిత్ సేనకు పెద్ద ఎదురుదెబ్బ అని ఆసీస్ హెడ్‌కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు. అయితే షమీ లేకపోయినా రిజర్వ్ పేసర్లు సైతం ఆసీస్‌లో సంచలనాలు సృష్టించగలరని తమకు తెలుసునని ఆ మేరకు తాము సిద్ధమయ్యామని తెలిపాడు. ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో డొనాల్డ్ మాట్లాడుతూ..

'ఆసీస్‌కు రాబోయే భారత జట్టులో షమీ లేకపోవడం భారీ లోటు.గత సిరీస్‌లలో అతడు తన పేస్, కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో మా బ్యాటర్లను ఎన్నో ఇబ్బందులకు గురిచేశాడు. షమీ లేకపోవడం మాకు కలిసొచ్చేదే కానీ అతడు లేకపోయినా బుమ్రా నేతృత్వంలోని భారత పేస్ దళం అద్భుతాలు చేయగలదని మాకు తెలుసు. గత సిరీస్‌లో రిజర్వ్ బౌలర్లతో బరిలోకి దిగినా భారత్ మెరుగైన ఫలితాలు సా వారిని తక్కువగా అంచనా వేయ అని చెప్పాడు. నవంబర్ 22 నుంచి బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి తెరలేవనుంది.

కెప్టెన్‌కు గుడ్ బై..

ఐపీఎల్ వేలం కంటే ముందు ఏ ఫ్రాంచైజీ ఎవరిని వదిలేస్తుంది? అనేది అంతుచిక్కడం లేదు. అక్టోబర్ 31కి మరో మూడు రోజులే ఉన్నందున అన్ని ఫ్రాంచైజీలు దాదాపు తుది జాబితా సిద్ధం చేసే ఉంటాయి. అయితే.. స్టార్ ఆటగాళ్లను వదిలేస్తాయా? అట్టిపెట్టుకుంటాయా? అనేది సందేహాలు రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితుల్లో లక్నో సూపర్ జెయింట్స్ తమ రిటెన్షన్ జాబితాను ఖరారు చేసిందనే వార్తలు వినిపిస్తున్నాయి. పద్దెనిమిదో సీజన్ కోసం ఆరుగురిని అట్టిపెట్టుకునేందుకు బీసీసీసీ అనుమతిచ్చింది. ఈసారైనా కప్ కొట్టాలనే కసితో ఉన్న లక్నో స్క్వాడ్‌లో సమూల మార్పులు చేయనుంది. నిలకడే కొలమానంగా తీసుకొని గత గత రెండు సీజన్లుగా అద్భుతంగా రాణించిన ఆటగాళ్లను అట్టిపెట్టుకోవాలని లక్నో యాజమాన్యం భావిస్తోంది. అందులో భాగంగానే ప్రస్తుతానికి ఐదుగురిని రిటైన్ చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చేసింది.

అందుకని ఐపీఎల్ 18వ సీజన్ కోసం చిచ్చరపిడుగు నికోలస్ పూరన్‌ను తొలి ప్రాధాన్యంగా ఆ తర్వాత పేస్ సంచలనం మయాంక్ యాదవ్, యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌లను రిటైన్ చేసుకోనుంది. అన్‌క్యాప్డ్ ప్లేయర్లుగా ఆకాశ్ బదోని, పేసర్ మొహ్సిన్ ఖాన్‌లు జట్టుతో కొనసాగనున్నారు.

Printed, Published and Owned by VELLENKI JAYAPAL REDDY, Printed at M/s KAKATIYA PRINTERS, H.No: 24-91/72/1, Block No. 29, Plot Nos. 72,73 and 74, Laxminarayana NagarIDA Uppal, Uppal Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 39. Published at H.No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 92,
Editor: VELLENKI JAYAPALREDDY, Cell: 9133445456,9346984911, Chief Editor L . SHYAM SUNDER REDDY, RNI NO : TELTEL/2023/84471,
Website: www.nedudailynews com, e-mail: vellenkijayapalreddy@gmail.com.

మొక్కలను నాటండి.. ఆహ్లాదాన్ని పంచండి..

అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత.. మంత్రి శ్రీధర్ బాబు

రామగిరి: సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఐటీ- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సోమవారం సింగరేణి సంస్థ, రామగుండం-3 ఏరియా ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ సమీపంలో 9 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు రూ.3కోట్ల 56 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఎకో పార్క్‌కు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన, భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు, ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా భాగస్వాములను చేశామని, గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాలలో 7శాతం సీట్లు- ఉద్యోగుల పిల్లలకు వచ్చేలా ఏర్పాటు చేస్తామని, మున్ముందు సింగరేణిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చెపడతామన్నారు. ఎకో పార్కునందు సుందరీకరణ కోసం వివిధ రకాల మొక్కలు నాటడమే కాకుండా బట్టర్ ఫ్లై గార్డెన్, లైటింగ్, వాటర్ ఫౌంటేన్లు, పక్షుల సందర్శన కేంద్రం తదితర వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

ఈ ఎకో పార్క్ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఎకో పార్కు నిర్మాణ పనులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే వారి దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం జి.యం. కార్యాలయం నందు మహిళా ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రెచ్ (శిశు సంరక్షణ కేంద్రం) భవనాన్ని ప్రారంభించి, మహిళా ఉద్యోగులతో మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న బిటెక్ విద్యార్థి అరెస్టు

డ్రగ్స్ విక్రయిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థిని ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ సిబ్బంది సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద ఏడు గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సిబ్బంది కథనం ప్రకారంఎపిలోని నెల్లూరు జిల్లాకు చెందిన కట్టమంచి జాన్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. స్కిల్స్ నేర్చుకునేందుకు హైదరాబాద్‌కు వచ్చి జెఎన్‌టియూలో చేరాడు. ఈ క్రమంలోనే జాన్ గంజాయి, డ్రగ్స్‌కు బానిసగా మారాడు. వీటిని కొనుగోలు చేసేందుకు డబ్బులు లేకపోవడంతో డ్రగ్స్, గంజాయి విక్రయించడం ప్రారంభించాడు.

వసస్థలిపురం ఎస్‌వీఆర్ గార్డెన్, క్రాంతి హీల్స్‌కాలనీ సుష్మా థియేటర్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. సుష్మా థియేటర్ సమీపంలో అనుమానంగా తిరుగుతున్న జాన్‌ను పట్టుకుని తనిఖీ చేయగా డ్రగ్స్ లభించాయి. ఉన్న వ్యక్తిని పట్టుకున్నారు. జాన్ రూ.2,500 గ్రాము ఎండిఎంఎను తీసుకువచ్చి రూ.5,000 విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ నంద్యాల అంజి రెడ్డి తెలిపారు.

60కి పైగా విమానాలకు బెదిరింపులు

భారతీయ విమానాలకు సోమవారం కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ రోజు 60కి పైగా విమానాలలో బాంబులు పెట్టారనే హెచ్చరికలు మొత్తం మీద వెలువడటంతో భద్రతా యంత్రాంగం అప్రమత్తం అయింది. ఇప్పుడు 21ఎయిరిండియా, 21 ఇండిగో, 20 విస్తారా విమానాలకు బెదిరింపులు వచ్చాయని అధికారులు తెలిపారు. గడిచిన 15 రోజులలో సామాజిక మాధ్యమాలు, ఫోన్ల ద్వారా ఈ బాంబు బెదిరింపుల తంతు ఎక్కువవుతూ వస్తోంది. దాదాపుగా ప్రతిరోజూ ఇటువంటి సమాచారం అందడం, ఎయిర్‌పోర్టులలో క్షుణ్ణంగా తనిఖీలు జరగడం పరిపాటి అయింది. పక్షం రోజుల్లో ఇప్పటివరకూ 410 వరకూ జాతీయ, అంతర్జాతీయ ప్రయాణ విమానాలకు బాంబు బెదిరింపుల సమాచారం అందింది.

సోదాల తరువాత చాలా వరకూ ఇవి అన్ని బూటకపు బెదిరింపులు అని స్పష్టం అయింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులతో జరిపిన చర్చలలో ఇటువంటి బాంబు బెదిరింపుల కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వివాదాస్పద లేదా అరాచక సామాజిక మాధ్యమ ఖాతాదారులపై చర్యలు తీసుకునే బాధ్యత ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాలపై ఉందని స్పష్టం చేసింది. ఉత్తుతి బెదిరింపులనే విషయం స్పష్టం అవుతూ ఉన్నా, ఎక్కడా ఎటువంటి జాప్యం నిర్లక్షం లేకుండా వెంటనే విమానాల తనిఖీలకు దిగడం , భద్రతాయుతం అని నిర్ధారించుకున్న తరువాతనే విమాన ప్రయాణాలకు అనుమతిని ఇస్తున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

డిజైనింగ్, డ్రాయింగ్ కేసీఆర్‌దే

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించడానికి స్థలాలను ఎంపిక చేయడం; బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం; ఆ నిల్వలను పెంచడం వంటి కీలక నిర్ణయాలన్నిటినీ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆరే తీసుకున్నారని రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ మేరకు తగిన ఆధారాలను; సీఎం కేసీఆర్ నేతృత్వంలో జరిగిన సమావేశ పత్రాలను జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్‌కు సమర్పించారు. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణలో భాగంగా సోమవారం ఆయన మరోసారి కమిషన్ ఎదుట క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరయ్యారు. ఇంతకుముందు కమిషన్ అడిగిన 16 ప్రశ్నలకు సంబంధించి తాను ఇచ్చిన జవాబులకు అనుగుణంగా సంబంధిత పత్రాలను అందజేశారు.

డీపీఆర్ తయారీ బాధ్యతను వ్యాప్కోస్‌కు అప్పగించాలని ఆదేశించింది ఎవరు? ఆ డీపీఆర్‌లకు ఎవరు ఆమోదం తెలిపారు!? బ్యారేజీలను ఫలానా ప్రాంతాల్లోనే కట్టాలని ఆదేశాలు ఇచ్చింది ఎవరు? అని కమిషన్ గత విచారణలో ప్రశ్నించగా.. మాజీ సీఎం కేసీఆరేనని చెప్పిన ఆయన.. ఇప్పుడు అందుకు సంబంధించిన పత్రాలను అందించారు. అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశాలతోనే హై పవర్ కమిటీ (హెచ్‌పీసీ) ఏర్పాటైందని, ఆ కమిటీ సమావేశంలోనే ఫలానా ప్రాంతాల్లో బ్యారేజీలు కట్టాలంటూ నిర్ణయం తీసుకున్నారని చెబుతూ.. హెచ్‌పీసీ సమావేశం తాలూకు మినిట్స్‌ను అందించారు. అలాగే, బ్యారేజీల వ్యయ అంచనాలకు, సవరణ అంచనాలకు ఎవరు ఆమోదం తెలిపారని కమిషన్ అడగ్గా.. కేసీఆరేనంటూ పత్రాలు సమర్పించారు. బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయాలని, ఆ నీటి నిల్వలను కొనసాగించాలని ఎవరు ఆదేశించారని ప్రశ్నించగా.. ప్రభుత్వాధినేత అంటూ కేసీఆర్ పేరు ఎత్తకుండా జవాబు ఇచ్చారు.బ్యారేజీల్లో సీకెంట్ పైల్స్ వినియోగించాలని చెప్పిందెవరని కమిషన్ ప్రశ్నించగా.. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) సిఫారసు చేసిందంటూ ఆధారాలను అందించారు. మూడు బ్యారేజీల జయో టెక్నికల్ పరీక్షలకు సంబంధించి 14 వాల్యూమ్‌ల నివేదికలను సమర్పించారు. బ్యారేజీల వద్ద టెయిల్ వాటర్ లేకపోవడం కూడా మేడిగడ్డలో బ్లాక్-7 కుంగుబాటుకు కారణమని, పిల్లర్లు 18, 19, 20 దెబ్బతినడానికి ప్రధాన కారణమని గుర్తు చేశారు. బ్యారేజీల్లో 2డీ, 3డీ అధ్యయనాలు మళ్లీమళ్లీ చేయాల్సి వచ్చిందా? అని కమిషన్ ప్రశ్నించగా.. అవునని బదులిస్తూ సంబంధిత పత్రాలనూ అందించారు. 3 బ్యారేజీల్లో ఐఎస్ కోడ్ 7349:2012లోని క్లాజులన్నీ పాటించారా అని కమిషన్ ప్రశ్నించగా.. అమలు చేశామని చెప్పారు. బ్యారేజీలు దెబ్బతిన్న తర్వాత వాటిని పరిశీలించి, మరమ్మతులు చేయాలని ఆదేశాలు ఇచ్చారా అని ఆరా తీయగా.. ఇచ్చానని వెంకటేశ్వర్లు తెలిపారు.

మేడిగడ్డలోని బ్లాక్-7 కుంగుబాటు, పలు పిల్లర్లు దెబ్బతినడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలకు డి జైన్ల ప్రకారం నిర్మాణం చేయకపోవడం, 2019 వరదల తర్వాత బ్యారేజీల దిగువ, ఎగువ భాగాల్లో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేయకపోవడమే కారణమని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం కమిషన్‌కు నివేదిక అందించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు సహాయంగా నిపుణుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిన విష యం తెలిసిందే. రికార్డులను, బ్యారేజీలను పరిశీలించి ఆ కమిటీ సోమవారం తన నివేదికను కమిషన్‌కు సమర్పించింది.

వరద ప్రవాహానికి అనుగుణంగా డి జైన్ జరగలేదని, డిజైన్ ఒక విధంగా ఇస్తే.. నిర్మాణం మరో విధంగా జరిగిందని, నీటిని మళ్లించడానికే బ్యారేజీలను నిర్మించారని, కానీ, నీటిని మళ్లించకుండా దీర్ఘకాలం నిల్వ చేయడంతో ఇసుక మైనింగ్ జరిగి బ్లాకు కుంగిందని వివరించింది. సీకెంట్ పైల్స్ సక్రమంగా వేయకపోవడం కూడా బ్యారేజీల వైఫల్యానికి కారణమని నివేదించినట్లు సమాచారం. ఇక ఈ దఫా క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. మంగళవారం కమిషన్ కార్యాలయానికి వచ్చిన అనంతరం సాయంత్రం జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్నారు. తదుపరి విచారణ నవంబరులో ప్రారంభం కానుంది.

కుక్కలకు కు.ని ఆపరేషన్

తెలంగాణలో రోజు రోజుకు వీధి కుక్కల బెడద పెరిగిపోతుంది. పిల్లలు, పెద్దలని తేడా లేకుండా చేస్తున్న దాడులు కూడా పెరిగిపోతున్నాయి. రోడ్ల మీద వెళ్లాలంటేనే జనాలు వణికిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే.. రోజురోజుకు పెరిగిపోతున్న కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు.. జగిత్యాల అధికారులు రంగంలోకి దిగారు. ఏకంగా.. 5000 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు. అయితే.. ఇందుకు ఏకంగా.. 70 లక్షల నిధులు మంజూరు చేసినట్టు తెలుస్తోంది.

'ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో వీధి కుక్కల బెడద రోజు రోజుకు పెరిగిపోతోంది. నిత్యం ఏదో ఓ చోట.. పిల్లలు, పెద్దలు అని తేడా లేకుండా వీధి కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఈ వీధి కుక్కల దాడుల్లో పలువురు చిన్నారులు తీవ్రంగా గాయపడితే.. మరికొంతమంది బుజ్జాయిలు ప్రాణాలు వదిలిన విషాదకర ఘటనలూ ఉన్నాయి. దీంతో.. వీధి కుక్కలను నియంత్రించాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్లు వస్తుండగా.. అధికారులు మాత్రం ఘటన జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసి ఆ తర్వాత వదిలేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కాగా.. ఆ ఆరోపణలకు తెర దించుతూ.. జగిత్యాలలో కుక్కల సంఖ్యను తగ్గించేందుకు మున్సిపాలిటీ అధికారులు రంగంలోకి దిగారు.

జగిత్యాల మున్సిపాలిటీలో కుక్కల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుండటంతో.. కుక్కల సంతానం ఎక్కువ అవ్వకూడదని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం.. మున్సిపాలిటీ నిధుల నుంచి రూ.70 లక్షల నిధులు మంజూరు చేశారు. ఒక్కో కుక్కకు రూ.1400 చొప్పున 5000 కుక్కలకు రూ.70 లక్షల నిధుల మంజూరుకు ఆమోదం తెలిపారు.

ఎంపీ పప్పూ యాదవ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ హెచ్చరిక

న్యూఢిల్లీ : బిహార్‌లోని పూర్ణియాకు చెందిన ఇండిపెండెంట్ ఎంపీ పప్పూ యాదవ్‌ను గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా సభ్యుడు ఒకడు బెదిరించాడు. హీరో సల్మాన్‌ఖాన్‌కు మద్దతుగా మాట్లాడినందుకు చంపేస్తామని హెచ్చరిస్తూ ఫోన్ చేశాడు. ఈ విషయాల్లో జోక్యం చేసుకోకూడదని హెచ్చరించాడు. దాంతో పప్పూ యాదవ్ బిహార్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. దీనిపై పప్పూ యాదవ్ ట్వీట్ చేస్తూ సల్మాన్ తరఫున తాను ఉన్నానని చెప్పారు. లారెన్స్‌ను పైసాకు పనికిరాని గ్యాంగ్‌స్టర్ అని విమర్శిస్తూ తనకు అవకాశం ఇస్తే 24 గంటల్లో ఆ ముఠాను రూపుమాపుతానంటూ బహిరంగంగా సవాలు విసిరారు. దీనిపై బిష్ణోయ్ ముఠా స్పందించింది. ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్‌లో మాట్లాడుతూ ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైలులో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ అక్కడి నుంచే వ్యవహారాలు నడుపుతున్నట్టు చెప్పాడు. ఆయనపై అన్న మాటలను వెనక్కి తీసుకోవాలని, ఇందుకు అవసరమైతే 'భాయ్'తో మాట్లాడే అవకాశం కల్పిస్తానని పప్పూ యాదవ్‌కు చెప్పాడు. ''మీరు 'భాయ్'కు ఓ మాట చెప్పండి.'నేనేమీ అనలేదు...అంతా మీడియా సృష్టే' అని చెప్పండి. సాధ్యమైనంత త్వరగా సెటిల్ చేసుకోండి. 'భాయ్'తో మాట్లాడిస్తా'' అని చెప్పాడు. అనంతరం పప్పూ యాదవ్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

రాజ్ పాకాలకు హైకోర్టులో ఊరట

పోలీసుల నోటీసుల నేపథ్యంలో రాజ్ పాకాల రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. పోలీసులు అక్రమంగా ఈ కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని, తనను అరెస్ట్ చేయకుండా ఆర్డర్స్ ఇవ్వాలని పిటిషన్‌లో ఆయన కోరారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. పోలీసుల ఎదుట హాజయ్యేందుకు ఆయనకు రెండు రోజుల సమయం ఇచ్చింది. రాజ్ పాకాల తరఫున మయూర్‌రెడ్డి వాదనలు వినిపించగా, ఇంట్లో పార్టీ చేసుకుంటే అక్రమంగా పోలీసులు వచ్చి రైడ్ చేశారన్నారు. ఆయన కంపెనీలో పని చేసే ఉద్యోగికి డ్రగ్స్ పాజిటివ్ వస్తే రాజ్ పాకాలను నిందితుడిగా చేర్చారని కోర్టుకు వివరించారు. రాజకీయ దురుద్దేశంతోనే కేసు పెట్టారని, ఇవాళ ఉదయం 9.30కి నోటీసులు పంపించి.. 11 గంటలకు విచారణకు రమ్మన్నారని కోర్టుకు ఆయన తెలిపారు.

పోలీసుల తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపించారు. అరెస్టు చేస్తామని తాము ఎక్కడా చెప్పలేదని, ఇప్పటి వరకు ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అక్రమంగా మద్యం సీసాలు లభించడంతోపాటు విజయ్ మద్దూరి అనే వ్యక్తికి డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిందని చెప్పారు. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, నిబంధనల ప్రకారమే రాజ్ పాకాలకు 41ఏ నోటీసులు ఇచ్చామని ఏజీ వివరించారు. ఈ మేరకు దర్యాప్తులో తీవ్ర నిర్ణయాలేమీ తీసుకోబోమని కోర్టుకు తెలిపారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం పోలీసుల ఎదుట హాజరయ్యేందుకు పిటిషనర్‌కు రెండు రోజుల గడువు ఇచ్చింది. చట్టప్రకారం ముందుకెళ్లాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

ప్రజాపాలన కాదు..ప్రజాపీడన

రాష్ట్రంలో 11 నెలల రేవంత్ రెడ్డి పాలన.. ప్రజాపాలన కాదు ప్రజాపీడన అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్‌రావు ఆక్షేపించారు. కాంగ్రెస్ పార్టీ ఏ వర్గానికి తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని, సిఎం వికృతరూపం బట్టబయలైందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా ధర్నాలతో అట్టుడికిపోతోందని చెప్పారు. ధర్నాలు చేస్తున్న వారిని చర్చలకు పిలవొచ్చు కదా..ఎందుకు చర్చలు జరపడం లేదని అడిగారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం మాత్రమే ముఖ్యమంత్రికి తెలుసు అని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని, హామీలు అమలు చేయమంటే నోటికొచ్చినట్టు తిడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంఎల్‌సిలు శంభీపూర్ రాజు, దేశపతి శ్రీనివాస్,దేవిప్రసాద్ పల్లె రవికుమార్‌లతో హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, కొత్త హామీలు అమలు చేయకపోగా, కెసిఆర్ మానవీయ కోణంలో పేదలు, ప్రజల కోసం తెచ్చిన పథకాను సిఎం రేవంత్ రెడ్డి కొనసాగించలేకపోతున్నారని అన్నారు. బతుకమ్మ చీరలు ఒకటి కాదు రెండు ఇస్తామన్నారని, కానీ ఒక్కటి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినప్పటికీ.. రైతుల కోసం కెసిఆర్ రైతుబంధు అమలు చేశారని చెప్పారు. రెండు పంటలకు కాదు మూడు పంటలకు రైతుబంధు ఇస్తా అని రేవంత్ రెడ్డి అన్నారని, కానీ ఒక్క పంటకు కూడా రైతు బంధు ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు పండించిన పంటలు కొనే దిక్కు లేదని ధ్వజమెత్తారు.

ఫాంహౌస్ ఘటన వెనుక రేవంత్ ప్రభుత్వ కుట్ర

ఫాంహౌస్ ఘటన వెనుక రేవంత్ ప్రభుత్వ కుట్ర ఉందని హరీశ్‌రావు ఆరోపించారు. అది ఫాంహౌస్ కాదు.. రాజ్ పాకాల కొత్త ఇల్లు అని తేల్చిచెప్పారు. రేవ్ పార్టీ అని కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని అది రేవ్ పార్టీ కాదు.. ఫ్యామిలీ ఫంక్షన్ అని స్పష్టం చేశారు. రేవ్ పార్టీలో పిల్లలు, వృద్ధులు ఉంటారా అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కొలేకనే..కెటిఆర్‌పై బురద జల్లుతున్నారని విమర్శించారు. మూసీ విషయంలో పేదల పక్షాన పోరాడుతున్నందునే కెటిఆర్‌ను రేవంత్ రెడ్డి టార్గెట్ చేశారని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరదీశారని విమర్శించారు. వివిధ వర్గాల నుంచి వస్తోన్న వ్యతిరేకతతో రేవంత్ రెడ్డి వణికిపోతున్నారని అన్నారు.

మహిళలకు గుడ్‌న్యూస్

- మహిళా స్వయం సహాయక సంఘాలకు ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు
- ఈ ఏడాది రూ.20 వేల కోట్లు మంజూరు
- వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ఈ ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తామని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు ఈ ఏడాదే రూ.20 వేల కోట్లు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా ఖమ్మం కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల ద్వారా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలెక్టరేట్ బస్టాప్ వద్ద స్త్రీ టీస్టాల్‌ను ప్రారంభించారు. మహిళా ఉద్యోగుల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కేటాయించిన ఫీడింగ్ రూమ్, డైనింగ్ హాలును ప్రారంభించారు.

అనంతరం మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ చిన్నతరహా పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి వారికి కేటాయించనున్నట్లు వెల్లడించారు. వడ్డీ లేని రుణాలు తీసుకుని పరిశ్రమలు స్థాపించాలని, ఆర్థిక స్వావలంబనతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దె బస్సులు సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.400 కోట్లు చెల్లిస్తోందని తెలిపారు.

తెలంగాణ మహిళలు దేశానికే ఆదర్శం కావాలి : ఎవరైనా మహిళా సంఘాలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భట్టి విక్రమార్క హెచ్చరించారు. తెలంగాణ మహిళలు దేశానికే ఆదర్శంగా ఉండాలంటూ ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలోనూ భవిష్యత్తులో వారికి భాగస్వామ్యం కల్పిస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో స్త్రీ టీసాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ సత్యనారాయణ, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేతలు,జడ్జీలు కలవడం మామూలే



న్యూఢిల్లీ : ముఖ్యమంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు తరచూ కలుసుకోవడం, మాట్లాడుకోవడం మామూలేనని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ఆ సమయంలో న్యాయ సంబంధ విషయాల ప్రస్తావన వారి మధ్య రాదని, అటువంటి సందర్భం తనకు ఒక్కటి కూడా గుర్తు లేదని ఆయన తెలిపారు. తమ ఇంట్లో గణపతి పూజా కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించడంపై రాజకీయ వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో... ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరికొద్ది రోజుల్లో పదవీవిరమణ చేయనున్న ఆయన ఈ వివాదంపై లోక్‌సత్తా వార్షిక సమావేశంలో స్పందించారు. ''ఎందుకని రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు కలుసుకుంటారో తెలుసుకోవాలని ప్రజలకు ఉంటుంది. అయితే, న్యాయవ్యవస్థతోపాటు రాజకీయ వ్యవస్థకు కూడా పరిణతి ఉంది. న్యాయ వ్యవస్థకు అవసరమైన బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. అది న్యాయమూర్తుల కోసం కేటాయించే బడ్జెట్ కాదు. నూతన కోర్టు భవనాలు, జిల్లాల్లో న్యాయమూర్తులకు కొత్త నివాస సముదాయాల ఏర్పాటు కోసం ఆ బడ్జెట్‌ను వినియోగిస్తారు. ఇలాంటి అవసరాలు తీరాలంటే ప్రధాన న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి కలిసి మాట్లాడుకోవడం అవసరం'' అని ఆయన వివరించారు.ఆగస్టు 14, జనవరి 26తో పాటు పెళ్లిళ్లు, మరణాలు.. ఇలా సందర్భం ఏదైనా సీఎం, చీఫ్‌జస్టిస్ కలుస్తుంటారు. న్యాయ సంబంధ అంశాలేవీ అక్కడ ప్రస్తావనకు రావు'' అని జస్టిస్ చంద్రచూడ్ వివరించారు. కాగా, గణపతి పూజ కోసం సీజే ఇంటికి ప్రధాని వెళ్లడంపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. శివసేన(యూబీటీ), శివసేన (షిండే) పార్టీల మధ్య వివాదంపై విచారణ నుంచి జస్టిస్ చంద్రచూడ్ తప్పుకోవాలని శివసేన (యూబీటీ) డిమాండ్ చేసింది.